Follow: @ANNTELUGU
23-09-2026
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 244 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణ సంస్కృతి ఉట్టిపడాలి

**ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాల ఆకృతులపై సీఎం సమీక్ష**

**చారిత్రక కట్టడాల స్ఫూర్తితో డిజైన్లు రూపొందించాలని ఆదేశం**

**హైదరాబాద్, మహా :** ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న తెలంగాణ భవన్ ఆకృతులు రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయాల శిల్ప, వాస్తు కళలు ఉట్టిపడేలా ఈ నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎయిర్‌పోర్టులు, ఢిల్లీ తెలంగాణ భవన్ నిర్మాణాలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రూపొందించిన పలు నిర్మాణ డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి.. ఆకృతులకు సంబంధించి

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### రూ.2,700కు లభించే మందుపై రూ.27,000 ఎంఆర్పీనా?



- ఔషధ ధరల భారీ వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

03

### రక్తం అమ్ముకుంటానా?



- అవమానాలు ఎన్నో భరించా
- అదృష్టం కాదు.. కష్టమే మనిషిని ముందుకు తీసుకెళ్తుంది.
- అభిమానుల సమావేశంలో మెగాస్టార్ చిరంజీవి భావోద్వేగం.

03

### సీఎం గారూ.. ప్లీజ్ రేవంత్ కు నాని రిక్వెస్ట్




- ప్రేక్షకులతో కలిసి..

02




## ఆదిలాబాద్ రిమ్స్‌లో ఘోర విషాదం

### అగ్నిప్రమాదంలో ముగ్గురు పసికందుల మృతి

- ఎస్ఎన్‌సీయూ వార్డులో మంటలు చెలరేగి ఇద్దరు శిశువుల మృతి
- 28 మంది చిన్నారులను సురక్షితంగా కాపాడిన సిబ్బంది
- షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి, విచారణకు ఆదేశం
- రిమ్స్ ను సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహ
- దుర్ఘటనపై విచారం వ్యక్తం చేసిన కంది శ్రీనివాసరెడ్డి

02



### రిమ్స్ ప్రమాదంపై కంది శ్రీనివాస రెడ్డి విచారం

ప్రమాదస్థలం పరిశీలన 02

### రిమ్స్ ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ

- నిర్లక్ష్యమని తేలితే కఠిన చర్యలు
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

02

## ఎల్లంపేటలో అక్రమార్కుల బరితెగింపు..!



### అరుణ గోదాంను సీజ్ చేసిన అధికారులు.. రాత్రికి రాత్రే తెరుచుకున్న వైనం..!

- ముున్సిపల్ నిబంధనలకు తూట్లు..!
- పత్తా లేని టౌన్ ప్లానింగ్ అధికారులు..!
- క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటున్న స్థానికులు..!

**మహా, బ్యూరో చీఫ్, హైదరాబాద్:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో గల గట్సార్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్స్‌కు చెందిన అరుణ గోదాం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మున్సిపల్ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో అధికారులు సీజ్ చేసిన గోదాం రాత్రికి రాత్రే తిరిగి తెరుచుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అధికారుల చర్యలను సైతం బేఖాతరు చేస్తూ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.స్థానికుల కథనం ప్రకారం, సంబంధిత గోదాంపై గత కొంతకాలంగా పలు ఫిర్యాదులు అందడంతో ఎల్లంపేట మున్సిపాలిటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనంతరం నిబంధనల ఉల్లంఘనలను గుర్తించిన అధికారులు 2026 ఆగస్టు 5 న గోదాంను సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన కొద్ది రోజులకే గోదాం తిరిగి తెరుచుకుని కార్యకలాపాలు

మిగతా 2వ పేజీలో

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో అక్రమార్కులు చట్టాలని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ బరితెగింపునకు పాల్పడుతున్నారు.. మున్సిపల్ నిబంధనలను బేఖాతర్ చేస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కుతున్నారు.. అధికారుల చర్యలను సైతం లెక్కచేయకుండా, సీజ్ చేసిన ఒక భారీ గోదాం వారం రోజులు కూడా గడవకముందే రాత్రికి రాత్రే తెరుచుకోవడం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది.. అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ నిర్మాణం కొనసాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.. భారీ స్థాయిలో ముడుపులు ముట్టడంతోనే అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అక్రమ నిర్మాణాలను, సీజ్ చేసిన భవనాలను పర్యవేక్షించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు పత్తా లేకుండా పోయారని బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



### జూరాల రైతుల కోసం కర్నాటక సీఎంతో రాష్ట్ర మంత్రుల భేటీ

డీకే శివకుమార్ కు రేవంత్ రెడ్డి ఫోన్

కర్నాటక సీఎంతో భేటీ అయిన మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి

అలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి వీటి విడుదల వేగం పెంచేందుకు ప్రయత్నం

**హైదరాబాద్, మహా :** జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమైంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి జూరాలకు నీటి ప్రవాహం పెంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశం అయ్యేందుకు బెంగళూరు వెళ్ళింది. జూరాల నుంచి నీటి విడుదలపై ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రులతో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జి మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డిలు సెక్రటేరియేట్ లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం అయ్యారు.

మిగతా 3వ పేజీలో

నిమ్స్ అధికారి

### లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ పంజా

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 13 చోట్ల ఏకకాలంలో సోదాలు.
- ఎర్రగడ్డతో పాటు కుటుంబ సభ్యుల నివాసాల్లోనూ ముమ్మర తనిఖీలు.

03



## వాయుగుండం పంజా.. ముంచెత్తిన వాన

- పలుచోట్ల స్తంభించిన రాకపోకలు.
- అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.
- మరో రెండు రోజులు అత్యంత భారీ వర్షా లు కురిసే అవకాశం



**హైదరాబాద్, మహా:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భాగ్యనగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన కురిసింది. ముఖ్యంగా నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం తీవ్రరూపం దాల్చింది. రహదారులపైకి భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు, పలు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నెమ్మదించింది.రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా అప్రమత్తం చేశారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని అధికారులు, హైదరాబాద్ విపత్తు స్పందన సంస్థ (హైడ్రా), పోలీసు శాఖలు పరస్పరం సమన్వయంతో

మిగతా 3వ పేజీలో

### నషా ముక్త్ భారత్ అభియాన్

- 400 మంది యువతతో మత్తు వ్యసనాల వ్యతిరేక ప్రతిజ్ఞ
- హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం
- హాజరైన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, యువతీయువకులు
- మార్పు నాతోనే ప్రారంభమవుతుంది" అంటూ యువత సంకల్పం

03



### మీరు వెళ్లి 5 రోజులు డ్రామాలు చేశారు

02

### ఏం తేల్చారో చెప్పండి మాజీమంత్రి జగదీష్ రెడ్డి ఫైర్

# ఆదిలాబాద్ రిమ్స్‌లో ఘోర విషాదం



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో సోమవారం అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో అగ్నిప్రమాదం జరగడంతో ముగ్గురు నవజాత శిశువులు మరణించారు. అప్రమత్తమైన సిబ్బంది వార్డులోని మరో 28 మంది చిన్నారులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి సుమారు 11:50 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు భావిస్తున్నారు. కొద్దిసేపట్లోనే వార్డు మొత్తం దట్టమైన పొగ, అగ్నికీలలతో నిండిపోయింది. దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ దురదృష్టకర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ముఖ్యంగా ఎస్ఎన్‌సీయూలోని ఎలక్ట్రికల్ వ్యవస్థ, ఏసీ పరికరాలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా? అనే కోణంలో దర్యాప్తు సాగనుంది. ఈ మరణాలకు సిబ్బంది నిర్లక్ష్యం ఏమైనా కారణమా? అనే అంశాన్ని కూడా తేల్చనున్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశం**

రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు శిశువులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో ప్రభావితమైన మిగతా చిన్నారులందరికీ అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్ భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

# తెలంగాణ సంస్కృతి ఉట్టిపడాలి

( మొదటి పేజీ తరువాయి )

నిర్మాణ డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి.. ఆకృతులకు సంబంధించి పలు కీలక మార్పులను సూచించారు. ప్రతి కట్టడంలోనూ తెలంగాణ వైభవం, వాస్తు, శిల్ప కళలకు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. విమానాశ్రయాల నిర్మాణ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్, బీఎస్ఎన్ఎల్ లైన్ల తరలింపు, తాగునీటి సరఫరా లైన్లు, వాగుల ప్రవాహ దిశ మార్పు, రహదారుల మళ్లింపు తదితర అడ్డంకులను అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనులు చేపడితే అనేక ఇబ్బందులు, తీవ్ర జాప్యం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యుత్, ఆర్ అండ్ బీ, తాగునీటి సరఫరా, నీటి పారుదల శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుని, బీఎస్ఎన్ఎల్ అధికారులతో చర్చించి ఏకకాలంలో పనులు సాగేలా చూడాలని ఆదేశించారు. కేవలం ప్రస్తుత అవసరాలనే కాకుండా భవిష్యత్ అవసరాలను సైతం పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళికతో పనులు ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సహజవనరులను రక్షించాలి**

సహజ వనరుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ



అడుగులు వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. విమానాశ్రయాల వద్ద వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సి వస్తే.. ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో లేదా సమీపంలోనే చెరువులను నిర్మించి, అక్కడి నుంచే ఆ ప్రవాహాలను మళ్లించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. విమానాశ్రయాలకు రాకపోకలు సాగించే రహదారులు అత్యంత విశాలంగా ఉండాలని చెప్పారు. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ వెంబడి రహదారులను నిర్మించి, వాటిని సమీపంలోని జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానించాలని ఆదేశించారు. సమన్వయంతో అడ్డంకులన్నీ అధిగమించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీఎం గారూ.. ప్లీజ్ రేవంత్ కు నాని రిక్వెస్ట్

**హైదరాబాద్, మహా :** ప్రముఖ నటుడు నాని తన తదుపరి చిత్రం 'ది ప్యారడైజ్' ప్రీమియర్ షోను ప్రేక్షకులతో కలిసి వీక్షించేందుకు అనుమతినివ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఆయన సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో గల ఒక థియేటర్‌లో అభిమానులతో కలిసి ఈ చిత్రాన్ని చూడాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అభ్యర్థనపై నాని 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ప్రేక్షకుల కోసం తీసిన సినిమాను వారితో కలిసే ఆస్వాదించాలనుకుంటున్నాను. వారి ప్రతిస్పందనలను ప్రత్యక్షంగా చూడటం నటుడిగా నాకు ఎంతో సంతృప్తినిస్తుంది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో సినిమా చూడటం ఒక ప్రత్యేకమైన అనుభవం" అని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన సందర్భంగా ప్రభుత్వం సూచించిన అన్ని నిబంధనలను, భద్రతా ప్రమాణాలను పాటిస్తామని హామీ ఇస్తూ, తన విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించాలని ఆయన కోరారు.




# రిమ్స్ ప్రమాదంపై కంది శ్రీనివాస రెడ్డి విచారం

**ఆదిలాబాద్ మహా :** పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి ఎస్ ఎన్ సీయూ వార్డులో జరిగిన ప్రమాద ఘటనపై ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. మంగళవారం ఉదయం ఆస్పత్రిలోని ఎస్ ఎన్ సీయూ వార్డును ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై రిమ్స్ డైరక్టర్ ను అడిగి తెలుసుకున్నారు.ముగ్గురు చిన్నారులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేసారు.బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.మిగతా చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# రిమ్స్ ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ

**ఆదిలాబాద్ మహా :** రిమ్స్‌లో మాతా, శిశు సంరక్షణ సేవలను మరింత బలోపేతం చేసేందుకు 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రిమ్స్ ఎస్ఎన్ సీయూ వార్డులో ప్రమాద ఘటన నేపథ్యంలో మంగళవారం ఆయన ఆసుపత్రిని సందర్శించారు.అగ్నిప్రమాదం జరిగిన నవజాత శిశు వార్డును పరిశీలించారు. ప్రమాద సమయంలో చేపట్టిన సహాయక చర్యలు, చిన్నారుల ప్రస్తుత వైద్య పరిస్థితి, చికిత్స అందుతున్న విధానం, తీసుకున్న తక్షణ చర్యలపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రిమ్స్ అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, రిమ్స్ వైద్యులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ప్రమాద ఘటన చాలా బాధాకరమన్నారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి, ఏసీకి సంబంధించిన ప్లాస్టిక్ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించినట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. అయితే ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర విచారణ అనంతరం పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు.ప్రమాదం జరిగిన వెంటనే రిమ్స్ సిబ్బంది, జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక, పోలీసు శాఖలు సమన్వయంతో స్పందించి, చికిత్స పొందుతున్న నవజాత శిశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ప్రభావిత చిన్నారులకు అత్యవసర వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం బాధాకరమని మంత్రి తెలిపారు. ప్రభావిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అవసరమైన చోట స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల సహకారాన్ని కూడా తీసుకున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం రిమ్స్‌లో సుమారు 800 పడకలు ఉన్నాయని, అదనంగా 150 పడకల ఎంసిఎచ్ భవనం ఏర్పాటు చేయడం ద్వారా రిమ్స్‌ను సుమారు 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. దీని వలన ప్రసూతి సేవలు, తల్లుల సంరక్షణ, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రిమ్స్‌లో పలు కొత్త విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. థలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా వంటి వ్యాధులకు మెరుగైన వైద్యం అందించేందుకు హెమటాలజీ విభాగం, రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అదేవిధంగా రిమ్స్‌లో పీజీ వైద్య విద్యార్థుల సంఖ్య, ఓపీ, ఐపీ సేవలను పెంచడంతో పాటు పీడియాట్రిక్స్, గైనకాలజీ, రేడియాలజీ తదితర విభాగాల్లో పీజీ సీట్ల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ కోసం నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా లోపాలు, నిర్వహణలో లోపాలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. రిమ్స్‌లో కింది మూడు కీలక సేఫ్టీ ఆడిట్‌లను నిర్వహించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్, ఫైర్ సేఫ్టీ ఆడిట్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్ నిపుణుల కమిటీ నివేదిక, సేఫ్టీ ఆడిట్‌ల ఆధారంగా రిమ్స్‌లో అవసరమైన మరమ్మతులు, అదనపు మౌలిక వసతులు, పునరుద్ధరణ పనులు, కొత్త భవనాల నిర్మాణం, అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలపై సమగ్ర అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని మంత్రి తెలిపారు. రిమ్స్‌లో మెయింటెనెన్స్, మానిటరింగ్, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తామని చెప్పారు. విచారణలో ఎవరి నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం బయటపడినా, నిబంధనల ప్రకారం తగిన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రిమ్స్‌లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన మానవ వనరులను సమకూర్చడం, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ఆస్పత్రిలో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ,వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చాంగ్తూ, డీఎంఏ వాణి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో మంద మకరంద్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు ,రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో సాధన, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపేటలో అక్రమార్కుల బరితెగింపు..!

( మొదటి పేజీ తరువాయి )

కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారుల ఆదేశాలకు విలువ లేదా? సీజ్ చేసిన గోదాంను తిరిగి తెరిచేందుకు అనుమతి ఎవరు ఇచ్చారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**మున్సిపల్ నిబంధనలకు తూట్లు..!**

పట్టణ ప్రణాళిక, భవన వినియోగ నిబంధనలను ఉల్లంఘిస్తూ గోదాం నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అనుమతులు, వినియోగ మార్పులు, భద్రతా ప్రమాణాల అంశాల్లో స్పష్టత లేకపోయినా కార్యకలాపాలు కొనసాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొంటున్నారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సీజ్ వరకే పరిమితమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పత్తా లేని టౌన్ ప్లానింగ్ అధికారులు..!**

గోదాంను సీజ్ చేసిన తర్వాత కూడా తిరిగి కార్యకలాపాలు ప్రారంభమైనా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సీజ్ అమలును పర్యవేక్షించాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలేమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ప్రోత్సాహమా..?**

అక్రమార్కుల బరితెగింపు వెనుక కొందరు ప్రభావశీలులతో పాటు ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు స్థానికంగా



జోరుగా వినిపిస్తున్నాయి. ఉన్నత స్థాయి అధికారుల ప్రోత్సాహం, పరోక్ష సహకారం ఉండటంతోనే గోదాం నిర్వాహకులు మున్సిపల్ అధికారుల సీజ్ చర్యలను సైతం లెక్కచేయకుండా తిరిగి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఉన్నతాధికారుల అండ ఉందనే ప్రచారం నేపథ్యంలోనే సంబంధిత మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా తదుపరి కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకసారి సీజ్ చేసిన గోదాం తిరిగి తెరుచుకున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. ఉన్నత స్థాయి అధికారుల జోక్యం ఏమైనా ఉందా? అందుకే క్షేత్రస్థాయి అధికారులు చర్యలకు జంకుతున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల ఆదేశాలకు సవాలా..?**

ఒకసారి సీజ్ చేసిన గోదాం తిరిగి తెరుచుకోవడం సాధారణ విషయం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ అధికారుల ఆదేశాలను ధిక్కరించి కార్యకలాపాలు కొనసాగిస్తే చట్టం పట్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

**క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..!**

సీజ్ ఆదేశాలను ఉల్లంఘించి గోదాం కార్యకలాపాలు తిరిగి కొనసాగిస్తున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కేవలం నోటీసులు, సీజ్ చర్యలతో సరిపెట్టకుండా.. నిబంధనల ఉల్లంఘనలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్, 2019 తో పాటు వర్తించే మున్సిపల్ చట్టాలు, భవన నిర్మాణ-పట్టణ ప్రణాళిక నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే సీజ్ చేసిన ప్రాంగణాన్ని తిరిగి సీజ్ చేయడంతో పాటు, అనధికారికంగా కొనసాగుతున్న కార్యకలాపాలను నిలిపివేయాలని వారు కోరుతున్నారు.అలాగే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గోదాంకి సంబంధిత మున్సిపల్ చట్టాల ప్రకారం నోటీసులు జారీ చేయడం, అనధికార నిర్మాణాలను తొలగించే చర్యలు, భవన వినియోగాన్ని నిలిపివేయడం, అనుమతులు/ఆక్యుపెన్సీకి సంబంధించిన చర్యలు వంటి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు. సీజ్ చేసిన గోదాంని అనుమతి లేకుండా తెరిచి కార్యకలాపాలు కొనసాగిస్తున్న బాధ్యులపై వర్తించే చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి..!**

గట్సార్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్స్ (అరుణ గోదాం) వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆగస్టు 5 న సీజ్ చేసిన గోదాం తిరిగి ఎలా తెరుచుకుంది..? సీజ్ అనంతరం ఎవరి అనుమతితో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి..? సంబంధిత అధికారులు ఎందుకు తదుపరి చర్యలు తీసుకోలేదు..? అనే అంశాలపై విచారణ జరపాలనివారు కోరుతున్నారు. అలాగే ఉన్నత స్థాయి అధికారుల ప్రమేయం ఉందంటూ వస్తున్న ఆరోపణలపైనా నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలను "ఉల్లంఘించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రూ.2,000 లోపు వ్యాపార చెల్లింపులకు ఫ్రీ

**ఢిల్లీ, మహా:** యూపీఐ చార్జీలపై జరుగుతున్న ప్రచారానికి కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టత ఇచ్చింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే పీ2పీ లావాదేవీలు ఎంత మొత్తమైనా పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. వ్యాపారులకు చేసే పీ2ఎం చెల్లింపుల్లో రూ.2 వేల వరకు ఎలాంటి ఎండీఆర్ ఉండదని స్పష్టం చేసింది. చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు నెలకు రూ.లక్ష వరకు యూపీఐ ద్వారా స్వీకరించే చెల్లింపులపై కూడా జీరో ఎండీఆర్ కొనసాగుతుందని పేర్కొంది. దీంతో మొత్తం పీ2ఎం లావాదేవీల్లో సుమారు 96 శాతం ఎలాంటి మార్పు లేకుండా ఉచితంగానే కొనసాగుతాయని కేంద్రం తెలిపింది.అక్టోబర్ 15, 2026 నుంచి రూ.2 వేలకుపైగా ఉన్న నిర్దిష్ట వ్యాపార లావాదేవీలకు 0.4 శాతం ఎండీఆర్ వర్తించనుంది. రూ.75 వేలకుపైగా లావాదేవీలకు ఎండీఆర్ గరి




ష్ఠంగా రూ.300గా నిర్ణయించారు. ఈ రుసుము వినియోగదారులపై కాకుండా వ్యాపార చెల్లింపు వ్యవస్థలోని సంబంధిత భాగస్వాముల మధ్య వర్తిస్తుంది. వినియోగదారుల నుంచి అదనపు యూపీఐ రుసుము వసూలు చేయరాదని బ్యాంకులకు సూచించారు. ఎండీఆర్‌ను ప్రభుత్వం లేదా ఎన్‌పీసీఐ వసూలు చేసే పన్ను కాదని కేంద్రం స్పష్టం చేసింది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, భద్రత, విస్తరణకు అవసరమైన ఆర్థిక స్థిరత్వం కల్పించడమే కొత్త విధానం ఉద్దేశమని తెలిపింది.

## మీరు వెళ్లి 5 రోజులు

# డ్రామాలు చేశారు

**ఏం తేల్చారో చెప్పండి**

**మాజీమంత్రి జగదీష్ రెడ్డి ఫైర్**

**హైదరాబాద్, మహా :** రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం నేరపూరిత చర్యకు పాల్పడిందని, తాము ప్రశ్నిస్తోంటే సమస్యలు పక్కదారి పట్టించేందుకు సర్కస్ చేస్తున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ శాసనసభ్యుడు జగదీష్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు నేరస్తుల తరహాలో ప్లాన్ చేసుకొని దాడులకు వెళ్తున్నారని, అనుమతి లేకుండా ఒకరి ఆస్తుల్లోకి వెళ్లకూడదన్న సంగతి కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల పర్యటనకు ఏర్పాట్లు, ఖర్చు ఎవరు చేశారని, ప్రభుత్వ ఖర్చు ఎంత అని నిలదీశారు. ఈ వ్యవహారం వెనక ముఖ్యమంత్రి ఉన్నారా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**బస్సు దిగగానే కాంగ్రెస్ నేతలకు భయం**

వ్యక్తుల భూముల్లోకి వెళ్లి విచారణ చేసే హక్కు ఎవరికైనా ఉంటుందా? రేపు వారి ఇళ్లల్లోకి ఎవరైనా వెళ్తే ఏం సమాధానం చెబుతారని జగదీష్ రెడ్డి నిలదీశారు. విచారణకు వెళ్తే అధికారులు వెళ్లాలి కానీ, ఐదు రోజులు డ్రామాలు చేసి కాంగ్రెస్ నేతలు ఏం సాధించారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడేది అబద్ధమని తేలిపోయిందని, తాను అఫిడవిట్‌లో చెప్పింది నిజమని చెప్పినందుకు వారికి ధన్యవాదాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ డ్రామాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్న సమాచారం వారికే వచ్చిందని, ఎందుకు తిరుగుతున్నామని కాంగ్రెస్ నేతలే అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. సీసీ కెమెరాలు ఉండడాన్ని తప్పుపట్టేవారు, భయపడేది నేర స్వభావం ఉన్న వారు మాత్రమే అన్న ఆయన అక్కడున్న సీసీ కెమెరాలు చూసి బస్సు దిగగానే కాంగ్రెస్ నేతలకు భయం ఎందుకని ప్రశ్నించారు.

# నషా ముక్త్ భారత్ అభియాన్

- 400 మంది యువతతో మత్తు వ్యసనాల వ్యతిరేక ప్రతిజ్ఞ
- హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం
- హాజరైన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, యువతీయువకులు
- మార్పు నాతోనే ప్రారంభమవుతుంది" అంటూ యువత సంకల్పం

**హైదరాబాద్, మహా :** దేశ భవిష్యత్తు అయిన యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడమే లక్ష్యంగా 'నషా ముక్త్ భారత్ అభియాన్' జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 400 మంది యువతీయువకులు మత్తు వ్యసనాలకు వ్యతిరేకంగా గళం విప్పారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షులు సత్య గౌర చంద్ర ప్రభుజీ నేతృత్వంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సైతం యువతతో కలిసి ప్రతిజ్ఞలో భాగస్వామ్యమయ్యారు. మత్తు రహిత జీవన విధానంపై యువతలో అవగాహన కల్పించే బలమైన సందేశాన్ని వారు ప్రజల్లోకి తీసుకెళ్లారు.

**క్షేమకరమైన జీవనమే లక్ష్యంగా**

ఈ ప్రతిజ్ఞా వేదికగా యువత తమ శరీరం, మనస్సు, బుద్ధి మరియు చైతన్యాన్ని పరిరక్షించుకుంటామని, ఎలాంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారబోమని శపథం చేశారు. క్షణిక ఆనందాల కోసం తమ స్వేచ్ఛను, ఉన్నత విలువలను త్యాగం చేయబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్పు నాతోనే ప్రారంభమవుతుంది అనే నినాదాన్ని యువత ప్రధానంగా స్వీకరించారు. తాము మారడంతో పాటు



తమ కుటుంబాలు, స్నేహితులు, చుట్టుపక్కల సమాజాన్ని కూడా మత్తు అలవాట్ల నుంచి దూరం చేసేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎవరినీ మత్తు వైపు ప్రోత్సహించకుండా సమాజానికి సానుకూల ఆదర్శంగా నిలుస్తామని తీర్మానించుకున్నారు. నగరం, రాష్ట్రం, దేశాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ఉద్ఘాటించారు.

**స్వేచ్ఛా, ఆత్మనిగ్రహాలకు ప్రతీక మత్తు రహిత జీవనం: సత్య గౌర చంద్ర ప్రభుజీ**

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న



సత్య గౌర చంద్ర ప్రభుజీ మాట్లాడుతూ.. మత్తుకు దూరంగా ఉండటం అనేది కేవలం ఒక అలవాటును వదిలివేయడం మాత్రమే కాదన్నారు. అది స్వేచ్ఛ, ఆత్మనిగ్రహం, అపారమైన శక్తి మరియు లక్ష్యబద్ధమైన జీవన విధానాన్ని ఎంచుకోవడమని ఆయన పేర్కొన్నారు. యువత తమ కుటుంబాలు, తోటివారికీ, సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలిచి నవశకానికి, మత్తు రహిత భారత నిర్మాణానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రతిజ్ఞ కేవలం ఒక తంతుగా కాకుండా జీవితాంతం ఆచరణలో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి నుంచి మొదలయ్యే ఈ చిన్న మార్పు.. రాబోయే రోజుల్లో కుటుంబం, సమాజంపై మరియు దేశవ్యాప్తంగా సానుకూల ప్రభావాన్ని చూపాలని కోరుకున్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ఠ భద్రత

**వేములవాడ, మహా:** వేములవాడ పట్టణ పరిధిలో సుమారు 320 గణేష్ మండపాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జనం, శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. బుధవారం జరగనున్న నిమజ్జన కార్యక్రమానికి 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. "జీరో యాక్సిడెంట్ -జీరో ఇన్సిడెంట్" లక్ష్యంతో ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లు, నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు.వేములవాడ ఆలయ గుడి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పికెట్లు, పుషింగ్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలకు అనుగుణంగా నిర్ణీత సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని కోరారు. శోభాయాత్రలో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగించినా, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే పాటలు వినిపించినా, బాణాసంచాతో ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు మంచి కండిషన్‌లో ఉండేలా చూడాలని, మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనవద్దని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

# రామగిరి భూ సమస్యల పై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

**పెద్దపల్లి మహా :** రామగిరి మండలంలో నెలకొన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం తగిన నిర్ణయాలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం రామగిరి మండలంలోని ఉప్పట్ల కేసారం గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సర్వే నంబర్ 35లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం రాజాపూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములుతో కలిసి భూ నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, భూసేకరణకు సంబంధించి వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి సంస్థ భూ సేకరణకు సంబంధించి ప్రాజెక్టు రిపోర్టు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. అయితే రైతుల అభ్యంతరాలు, అభిప్రాయాలను పూర్తిగా తెలుసుకుని, వాటిని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే భూ సేకరణపై తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో డీసీపీ రామ్‌రెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేష్, తహసీల్దార్ సుమన్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పశుసంపద మిషన్‌ను పకడ్బందీగా అమలు చేయాలి: కలెక్టర్

**పెద్దపల్లి మహా :** జిల్లాలో జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్ (NDLM)ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రతి పశువుకు 12 అంకెల బార్‌కోడ్ చెవి ట్యాగ్ ఏర్పాటు చేసి, యజమాని ఆధార్, మొబైల్ నంబర్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. పశువుల జాతి, వయస్సు, వ్యాక్సినేషన్, వైద్యం, గర్భధారణ తదితర వివరాలను భారత్ పశుధన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో రైతులకు ప్రయోజనం చేకూరేలా కనీసం ఐదు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎన్ డి ఎల్ ఎం అమలును అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి డా. వేణుగోపాల్‌రావు, ఇన్‌చార్జి డీపీఓ శ్రీమాల, మండల పశువైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మనగర్‌లో మహా అన్న ప్రసాదం

- గణపయ్య పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం..
- అన్నప్రసాద దాతలుగా డాక్టర్ కొమరం లక్ష్మణరావు దంపతులు

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ముత్యాలమ్మనగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. గణపతి ఉత్సవాలు భక్తిభావంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మహా అన్నదాన కార్యక్రమానికి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) డాక్టర్ కొమరం లక్ష్మణరావు, సతీమణి ఉపాధ్యాయురాలు సత్యదేవి దంపతులు అన్నప్రసాద వితరణ దాతలుగా వ్యవహరించారు. వారి సహకారంతో భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. గణపతి నామస్మరణతో ముత్యాలమ్మనగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సిఐ పాటి నాగబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మంత్రుల జల దోపిడిని అరికట్టాలి

**ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య**



**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ నీళ్లను కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు అందజేయాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి లు డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడు మండల పరిధిలోని వినోబా నగర్ ప్రాంతంలోని సీతారామ ప్రాజెక్టును మాస్ లైన్ పార్టీ ప్రతినిధి బృందం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో వేల ఎకరాల భూములు కోల్పోయి ప్రాజెక్టు నిర్మాణం జరిగితే, ఈ జిల్లాలోని రైతాంగానికి నీరు అందించకుండా, ఇతర ప్రాంతాలకు జలాలను తరలిస్తూ ఉమ్మడి జిల్లాలోని మంత్రులు జలదోపిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతం నుంచి ఖమ్మం జిల్లాకు నీరు తరలిస్తున్నారని, ఇక్కడ రైతాంగానికి కూడా నీరు అందించేందుకు చర్యలు చేపట్టకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో డిజైన్ చేసిన విధంగా రోళ్లపాడు చెరువు నింపడం ద్వారా భద్రాద్రి జిల్లాతో పాటు, మహబూబాబాద్ జిల్లాకు కూడా తక్కువ ఖర్చుతో నీరందించే అవకాశం ఉన్నప్పటికీ, గతంలో అధికారంలో ఉన్నటిఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ చేసి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి చుక్క నీరును ఈ జిల్లా రైతాంగానికి అందించలేదని విమర్శించారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మొదట నష్టపోతున్న ప్రాంతానికి నీరు అందించకుండా, మంత్రులు అధికార బలంతో ఇతర ప్రాంతాలకు నీరు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి కాలువలు నిర్మించారని, పంటలు పండే వారికే మరో పంట పండేందుకు నీరు అందించి మంత్రులు తమ కుటిల బుద్ధిని చాటుకున్నారని అన్నారు. జిల్లాలోని ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు నీరు అందించేందుకు తక్షణమే సీతారామ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న చెరువులకు నీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన పంట కాలువల తీయాలని వారు డిమాండ్ చేశారు. దీని ద్వారా సుజాత నగర్ ప్రాంతంలోని సింగభూపాలెం ప్రాజెక్టు కూడా నీరు చేరి పంటలు పండేందుకు అవకాశం ఉన్నదని వారన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు జిల్లాలో నష్టపోయిన రైతాంగం కోసం, జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, అమర్లపూడి రాము, జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు, భానోత్ ధర్మ, ఎస్ కే యాకుషావలి, కల్లూరి కిషోర్, బుర్ర వెంకన్న, లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్, బైరు వెంకన్న, రాయల సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# జూరాల రైతుల కోసం కర్నాటక సీఎంతో రాష్ట్ర మంత్రుల భేటీ

**( మొదటి పేజీ తరువాయి )**



నీటి లభ్యత, పంటలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కర్ణాటక నుంచి వచ్చే ప్రవాహాన్ని పెంచే అవకాశాలపై ఆ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అనంతరం కర్ణాటక ప్రభుత్వంతో నేరుగా సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు. ఈ బృందంలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి జూరాల వైపు నీటి ప్రవాహాన్ని పెంచాలని కర్ణాటక ముఖ్యమంత్రిని మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కోరనుంది. ప్రస్తుతం పంటలకు అవసరమైన నీటిని దశలవారీగా అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణపై దృష్టి పెట్టింది. జూరాల నీటి సమస్యపై ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. జూరాల నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నీరు అందక పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు.

**జడ్చర్ల వద్ద బీజేపీ అధ్యక్షుడి అరెస్టు**

మరోవైపు.. జూరాల ప్రాజెక్టును సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావును జడ్చర్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు పలువురు బీజేపీ నేతలను కూడా ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. రామ్‌చందర్‌రావు జూరాలకు వెళ్లి రైతులను కలవనున్నట్లు ముందుగానే ప్రకటించడంతో.. పోలీసులు అలర్ట్ అయ్యారు. రామ్‌చందర్‌రావు పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో బీజేపీ కార్యకర్తలు జడ్చర్ల వద్ద హైదరాబాద్-బెంగళూరు నేషనల్ హైవేపై ఆందోళనకు దిగారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రైతుల సమస్యలను ప్రస్తావించేందుకు వెళ్తున్న తమ పార్టీ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని బీజేపీ నేతలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రామ్‌చందర్‌రావు అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

**రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం**

జూరాల వద్ద నీటి లభ్యత, సాగునీటి విడుదలపై ప్రభుత్వం,ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కర్ణాటక నుంచి వచ్చే నీటి ప్రవాహం కూడా ఈ వ్యవహారంలో కీలకంగా మారింది. గతంలో ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి వచ్చే ప్రవాహాలు తగ్గడంతో జూరాల నీటి పరిస్థితిపై ప్రభావం పడినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కర్ణాటక సర్కార్‌తో చర్చల ద్వారా జూరాలకు అదనపు నీటి ప్రవాహం సాధించే ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేస్తుండగా.. మరోవైపు రైతులు పంటలను కాపాడేందుకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో బెంగళూరులో డీకే శివకుమార్‌తో జరగనున్న తెలంగాణ మంత్రుల సమావేశం.. కర్ణాటక ప్రభుత్వం నుంచి వచ్చే స్పందనపై జూరాల ఆయకట్టు రైతుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## రూ.2,700కు లభించే మందుపై
# రూ.27,000 ఎంఆర్పీనా?

**ఔషధ ధరల భారీ వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం**

**ఢిల్లీ, మహా :** ప్రాణాలను కాపాడే కీలకమైన ఔషధాల ధరల నిర్ణయంలో ఉన్న భారీ వ్యత్యాసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తయారీదారులు రిటైలర్లకు విక్రయించే ధరకు, ఔషధ ప్యాకెట్‌పై ముద్రించే గరిష్ట చిల్లర ధరకు (ఎంఆర్పీ) మధ్య ఏకంగా పది రెట్ల వ్యత్యాసం ఉండటంపై ధర్మాసనం తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. తయారీదారు నుంచి రిటైలర్‌కు రూ.2,700కే లభించే క్యాన్సర్ ఔషధానికి ప్యాకెట్‌పై రూ.27,000 ఎంఆర్పీని ఎలా నిర్ణయిస్తారని కోర్టు సూటిగా ప్రశ్నించింది. ఔషధ ధరల నియంత్రణ విధానంలో ఉన్న లోపాలను ఈ ఒక్క ఉదాహరణ స్పష్టంగా ఎత్తిచూపుతోందని వ్యాఖ్యానించింది. కిషన్ చంద్ జైన్ తదితరులు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా సామాన్యుల ఆర్థిక పరిస్థితిని న్యాయమూర్తులు ప్రస్తావించారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన కుటుంబాలు.. ఆ అధిక చికిత్స ఖర్చులు, మందుల భారం భరించలేక సొంత ఇళ్లు, బంగారు ఆభరణాలు సైతం అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొనడం పట్ల ధర్మాసనం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఇటువంటి తరుణంలో ఔషధ ధరల నియంత్రణ వ్యవస్థలు ప్రజల ప్రయోజనాలను ఏమేరకు కాపాడుతున్నాయనే ప్రశ్నను లేవనెత్తింది. తాము రిటైలర్లకు తక్కువ ధరకే మందులు విక్రయిస్తున్నామని తయారీదారులు వాదిస్తే.. మరి ప్యాకెట్‌పై అంత భారీ ఎంఆర్పీని ముద్రిస్తోంది ఎవరని కోర్టు నిలదీసింది. ఔషధాలపై ఇంత భారీ స్థాయిలో ఎంఆర్పీని నిర్ణయిస్తే, అది కేవలం సామాన్యులకే కాకుండా ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాల ద్వారా ప్రజాధనంపైనా పెను భారం మోపుతుందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.భారతీయ ఔషధ మార్కెట్‌లో సుమారు 80 నుంచి 82 శాతం వాటా 'నాన్‌షెడ్యూల్డ్' మందులదేనని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) ఇదివరకే వెల్లడించింది. అయితే, ప్రభుత్వం అన్ని మందుల ధరలను గాలికొదిలేసిందనడం పూర్తి వాస్తవం కాదు. షెడ్యూల్డ్ మందుల కింద ఉన్న 935 ఔషధాలకు ఎన్‌పీపీఏ గరిష్ట ధరలను నిర్ణయించింది. ఇందులో 131 క్యాన్సర్ మందులు కూడా ఉన్నాయి. అలాగే, నాన్‌షెడ్యూల్డ్ మందుల విషయంలోనూ గత 12 నెలల్లో ఉన్న గరిష్ట ధరపై కేవలం 10 శాతం మాత్రమే పెంచుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. అయినప్పటికీ, వాస్తవ ఉత్పత్తి వ్యయం, రిటైలర్‌కు అమ్మే ధర, ప్యాకెట్‌పై ముద్రించే గరిష్ట ధరకు మధ్య ఇంత భారీ అంతరం ఎందుకు ఉంటోందన్నదే ఇప్పుడు న్యాయస్థానం ముందున్న ప్రధాన ప్రశ్న. ప్రతి దశలోనూ ఈ ధరల నిర్ణయం ఏ ప్రాతిపదికన జరుగుతోందన్న దానిపై సమగ్ర పరిశీలన జరగాలని కోర్టు స్పష్టం చేసింది.



## వాయుగుండం పంజా..
# ముంచెత్తిన వాన

**( మొదటి పేజీ రువాయి )**

క్షేత్రస్థాయిలో పనిచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, కాలనీల్లో వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని, మోటార్లు, డీవాటరింగ్ యంత్రాలతో నీటిని తోడేయాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు తెలంగాణవ్యాప్తంగా రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. సెప్టెంబర్ 23, 24 తేదీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. ఇక నగరంలో సెప్టెంబర్ 26 వరకు ఆకాశం మేఘావృతమై మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు అనవసరంగా రోడ్లపైకి రావొద్దని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. సహాయం కోసం కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# రక్తం అమ్ముకుంటానా?

**హైదరాబాద్, మహా:** తాజాగా అభిమానులతో జరిగిన ఓ ఆత్మీయ సమావేశంలో మెగాస్టార్ చిరంజీవి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తన సేవా కార్యక్రమాలపై, ముఖ్యంగా బ్లడ్ బ్యాంక్‌పై కొందరు ఉద్దేశపూర్వకంగా చేసే విమర్శలను ఆయన తీవ్రస్థాయిలో తిప్పికొట్టారు. తనకంటూ అవమానాలు ఏమీ లేవని అనుకోవద్దని, చిరంజీవి రక్తం అమ్ముకున్నాడని కొందరు చాలా తేలికగా, మూర్ఖంగా కామెంట్స్ చేస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాల ద్వారా తనకొచ్చే రెమ్యునరేషన్ ముందు.. ఎన్ని కోట్ల బ్లడ్ ప్యాకెట్లు అమ్మితే ఆ డబ్బుతో సమానం అవుతుందో విమర్శకులు కాస్త బుర్రపెట్టి ఆలోచించాలని ఘాటుగా స్పందించారు. బయట ఎవరి దగ్గరా చేయి చాచి విరాళాలు తీసుకోకుండా, కేవలం తన కష్టార్జితంతోనే బ్లడ్ బ్యాంక్‌ను నడుపుతున్నానని, దానికి అభిమానుల నుంచి లభించే అండదండలు వెలకట్టలేనివని ఆయన స్పష్టం చేశారు. అందుకే అలాంటి చిల్లర విమర్శలను తాను ఏమాత్రం పట్టించుకోనని తేల్చి చెప్పారు. జీవితంలో విజయం సాధించడం వెనుక అదృష్టం ఉందనే వాదనను చిరంజీవి నిర్మొహమాటంగా కొట్టిపారేశారు. అదృష్టం అనేది కొందరికే సొంతమనే వాదనను తాను నమ్మనని, కష్టాన్నే నమ్ముకోవాలని అభిమానులకు సూచించారు. సరైన సమయంలో సమయస్ఫూర్తితో (కామన్ సెన్స్) వ్యవహరించి, వచ్చిన అవకాశాలను ఆలింగనం చేసుకుంటూ సద్వినియోగం చేసుకుంటేనే అద్భుతాలు సృష్టించవచ్చని వివరించారు. నేడు ప్రపంచంలోని అత్యున్నత సంస్థలైన గూగుల్, వరల్డ్ బ్యాంక్ తదితర వాటికి సత్య నాదెళ్ల లాంటి మన భారతీయులు సీఈఓలుగా ఉండటం మనందరికీ గర్వకారణమన్నారు. వాళ్లంతా ఆకాశం నుంచి ఊడిపడలేదని, మన చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కష్టపడి పైకొచ్చిన వారేనని, కేవలం అదృష్టవంతులకే ఉన్నత స్థానాలు దక్కుతాయనుకోవడం పొరపాటని గుర్తుచేశారు. తన ప్రయాణాన్ని సైతం ఉదాహరణగా చెబుతూ.. తానూ ఎక్కడో మారుమూల పల్లెటూరులో, ఓ సాదాసీదా దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చినవాడినేనని చిరంజీవి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చిన్నతనంలోనే తన ఆశయాన్ని గుర్తించి, ఆ దిశగా అడుగులు వేస్తూ 'నేనెందుకు సాధించకూడదు?' అని ప్రశ్నించుకుంటూ తనపై తాను నమ్మకాన్ని పెంచుకున్నానని తెలిపారు. జీవితంలో ఎప్పుడైనా నీరసం లేదా నిరుత్సాహం ఆవహించినప్పుడు, చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో అద్దం ముందుకు వెళ్లి.. 'ఏయ్.. గ్రేట్ రా! నన్ను మించిన వాడు ఎవడున్నాడురా? శభాష్!' అని తనకు తాను ధైర్యం చెప్పుకుంటానని తన సక్సెస్ సీక్రెట్‌ను పంచుకున్నారు. మనం దేన్నైతే బలంగా కోరుకుంటామో, ప్రకృతి కూడా దాన్నే పదింతలు తిరిగి ఇస్తుందని.. ఈ 'లా ఆఫ్ అట్రాక్షన్' సిద్ధాంతమే తనను ఎప్పుడూ ముందుకు నడిపిస్తుందని మెగాస్టార్ ఎంతో స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు.





# నిమ్స్ అధికారి లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ పంజా

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 13 చోట్ల ఏకకాలంలో సోదాలు.

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ బృందాలు హైదరాబాద్‌తో పాటు మరో మూడు జిల్లాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. లక్ష్మీభాస్కర్ నివాసాలు, కార్యాలయాలతో పాటు ఆయన బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్లలో కలిపి మొత్తం 13 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ ఎర్రగడ్డలోని కల్పతరువు అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న ఆయన నివాసంతో పాటు ఇతర ప్రాంతాల్లో పలు బృందాలుగా విడిపోయిన అధికారులు ఉదయం నుంచే ఈ సోదాలు ప్రారంభించారు. లక్ష్మీభాస్కర్ తనకు ఉన్న చట్టబద్ధమైన ఆదాయ వనరులకు మించి అక్రమంగా ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు ఖాతాలు, డిపాజిట్లు, ఇతర కీలక ఆర్థిక లావాదేవీల రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా నిమ్స్‌లో వైద్య సేవలు అందిస్తున్న ఆయన, గత ఐదేళ్లుగా డిప్యూటీ లేదా అదనపు సూపరింటెండెంట్ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన తన పదవిని అడ్డం పెట్టుకుని అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.ఈ దాడుల్లో లక్ష్మీభాస్కర్‌కు చెందిన సుమారు రూ.70 కోట్ల నుంచి రూ.100 కోట్లకు పైగా మార్కెట్ విలువ కలిగిన ఆస్తులను గుర్తించినట్లు సామాజిక మాధ్యమాల్లో, పలు వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై ఏసీబీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలు, బ్యాంకు ఖాతాల వివరాలను పూర్తిస్థాయిలో విశ్లేషించిన తర్వాతే ఆస్తుల వాస్తవ విలువపై స్పష్టత వస్తుందని తెలుస్తోంది. మరోవైపు ఈ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో లక్ష్మీభాస్కర్‌ను అరెస్టు చేసినట్లు వస్తున్న వార్తలపై కూడా అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. సోదాలు ముగిసిన అనంతరం అక్రమాస్తుల లెక్కలు తేల్చి, తదుపరి చట్టపరమైన చర్యలు, అరెస్టు తదితర అంశాలపై ఏసీబీ అధికారులు అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది.






## టమి బలంగా నిలబడాలి

**జనసేన గౌరవానికి భంగం వాటిల్లకూడదు**

**పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

పిఠాపురం, మహా : కూటమి ప్రభుత్వంలో అంతా కలిసికట్టుగా పనిచేయాలని, అదే సమయంలో ఎవరి గౌవరం తగ్గకూడదని.. జనసేన పార్టీ గౌరవానికి భంగం వాటిల్లకూడదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. తనకు కృతజ్ఞత చూపించేతత్వం చాలా ఎక్కువని, అది తన స్వభావం అన్నారు. వచ్చే 3, 4 నెలల్లో క్యాంప్ ఆఫీసు పిఠాపురానికి మార్చుతానని, జనసేన నాయకులందరికీ దిశా నిర్దేశం చేయాలన్నారు. పదవులు తీసుకున్న తరువాత మన నాయకులంతా మెత్తపడ్డారంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ఏపీ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని స్పష్టం చేశారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కాలేజీ స్టేడియంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలబడటమే తన నైజమని పేర్కొన్న ఆయన, పిఠాపురం ప్రజల అవసరాలు తీర్చడమే మొదటి ప్రాధాన్యత అని ప్రకటించారు. ఈ ఏడాది చివరికల్లా పిఠాపురంలో తన క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు పూర్తి కాగా, తాజాగా మరో రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని, ఇప్పటికే రూ. 200 కోట్లతో 600కు పైగా సీసీ, బీటీ రోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చామని పవన్ కళ్యాణ్ వివరించారు. మరో 202 రహదారులను తాజాగా ప్రారంభించినట్లు చెప్పారు. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకం ఆధునీకరణ ద్వారా 97 వేల మందికి తాగునీరు ఇస్తున్నామని, జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0, ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో దాదాపు రూ. 460 కోట్లతో గ్రామాలు, మున్సిపాలిటీల్లో తాగునీటి ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ రూ. 34 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి నిర్మాణం, రూ. 45 కోట్లతో కాకినాడ జీజీహెచ్‌లో ఆంకాలజీ బ్లాక్, పిఠాపురంలో రూ. 100 కోట్లతో ఆయుష్ మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పిఠాపురం పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ. 225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉప్పాడ తీరప్రాంత ప్రజలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న సముద్రపు కోత సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ. 323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిపిన చర్చలు, ఐఐటీ మద్రాస్ సర్వేల ఆధారంగా ఈ ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానుందని తెలిపారు. పీఎం గతిశక్తి కింద రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జ్, అమృత్ భారత్ పథకంలో రూ. 37 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునీకరణ, పాడా నిధులతో రూ. 20 కోట్లతో బస్ స్టాండ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.



# మారెళ్లపాడు ఎత్తిపోతలకు సర్వం సిద్ధం..

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం..
- సభాస్థలి, డెలివరీ పాయింట్, హెలిప్యాడ్‌ల తనిఖీ

**మణుగూరు / అశ్వాపురం, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఇరిగేషన్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి సభాస్థలి, ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్, హెలిప్యాడ్ ప్రాంతాలను తనిఖీ చేశారు. గొందిగూడెంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడ చేపడుతున్న ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్‌ను సందర్శించి పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మంత్రుల రాక కోసం మారెళ్లపాడులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. మంత్రుల పర్యటనకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను సైతం ఎమ్మెల్యే పరిశీలించారు. పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, భద్రతాపరంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, కార్యకర్తలతో పాటు ఇరిగేషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు...

**మంత్రుల పర్యటనకు పటిష్ట బందోబస్తు**

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి మంత్రుల పర్యటన నేపథ్యంలో పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించింది. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి మంగళవారం సీఐ ఎల్లయ్యతో కలిసి ప్రారంభోత్సవ వేదిక, ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్, హెలిప్యాడ్‌తో పాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మంత్రులు ప్రయాణించే మార్గం, సభాస్థలి వద్ద వాహనాల రాకపోకలు, పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులకు డీఎస్పీ సూచనలు చేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. హెలిప్యాడ్ నుంచి ప్రారంభోత్సవ ప్రాంతం, సభాస్థలి వరకు భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. మంత్రుల పర్యటన, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సజావుగా జరిగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. డీఎస్పీ వెంట సీఐ ఎల్లయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బిక్షాటన రహిత నగరంగా
# వరంగల్ ను తీర్చిదిద్దాలి

- జిడబ్ల్యూఎంసి కమీషనర్ టి. వెంకన్న
- పునరావాస కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్



**హనుమకొండ, మహా** : గ్రేటర్ వరంగల్ నగరాన్ని బిక్షాటన రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో బిక్షాటనకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన సంరక్షణతో పాటు గౌరవప్రదమైన జీవనానికి మార్గం చూపాలని సూచించారు. మంగళవారం హన్మకొండ పరిధిలోని భీమారంలో మినిస్ట్రీ ఫర్ సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్, జిడబ్ల్యూఎంసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ పునరావాస కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో బిక్షాటన నుంచి పునరావాసం పొందుతున్న వారికి కల్పిస్తున్న వసతి, భోజనం, వైద్య సేవలు తదితర సౌకర్యాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచించిన (సపోర్ట్ ఫర్ మార్జినలైజ్డ్ ఇండివిజువల్ ఫర్ లైవ్లీ హుడ్ అండ్ ఎంటర్ప్రైజ్) కార్యక్రమంలో భాగంగా బిక్షాటన చేసేవారిని గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందిస్తూ పునరావాసం కల్పించాల్సి ఉందన్నారు. రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో బిక్షాటన చేయకుండా, స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వారిని తరలించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి వసతి, పోషకాహారం, వైద్య సేవలు, వ్యక్తిగత పరిశుభ్రత, కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి తో పాటు జీవనోపాధికి అవసరమైన సహకారం అందించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ తెలిపారు. కేవలం బిక్షాటనను నిరోధించడం మాత్రమే కాకుండా, సంబంధిత వ్యక్తుల పరిస్థితులను అర్థం చేసుకుని వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం పునరావాస కేంద్రం నిర్వాహకులు నిర్వహిస్తున్న రిజిస్టర్లు, లబ్ధిదారుల వివరాలను కమిషనర్ పరిశీలించారు. కేంద్రంలో ఉన్న వారికి అందుతున్న సౌకర్యాలు, వైద్య సేవలు, భోజనం, వసతి తదితర అంశాలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. కేంద్రం నిర్వహణలో అవసరమైన మౌలిక వసతులు, సేవల విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో బిక్షాటన చేస్తున్న వారిని గుర్తించడం, వారి వివరాలను నమోదు చేయడం, అవసరమైన వారికి పునరావాసం కల్పించడం వంటి అంశాల్లో బల్దియా అధికారులు, పోలీసు శాఖ, మెప్మా, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ తనిఖీలో అదనపు కమిషనర్ జోనా, మెప్మా పీడీ రాజేశ్వర్ రావు, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, డీఎంసీ రజితా రాణి, టీఎంసీలు రమేష్, వెంకట్ రెడ్డి, హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అంజలి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## మూలసాలలో పిడుగుపాటు.. 25 గొర్రెలు మృతి

**పెద్దపల్లి మహా:** పెద్దపల్లి మండలం మూలసాల గ్రామంలో పిడుగుపాటు ఘటనలో సుమారు 25 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బోయిని సదయ్య, కాసు నరేష్‌కు చెందిన గొర్రెల మందపై ఒక్కసారిగా పిడుగు పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది.గొర్రెల మందపై పిడుగు పడటంతో సుమారు 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. దీంతో గొర్రెల యజమానులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. గొర్రెల పెంపకమే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న తమకు ఈ ఘటనతో భారీగా ఆర్థిక నష్టం వాటిల్లిందని వారు వాపోయారు. పిడుగుపాటు ఘటనతో మూ లసాల గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఘటనపై పరిశీలన జరిపి మృతి చెందిన గొర్రెల సంఖ్య, జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని బాధితులు కోరుతున్నారు. పిడుగుపాటుతో నష్టపోయిన తమకు ప్రభుత్వ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బోయిని సదయ్య, కాసు నరేష్ విజ్ఞప్తి చేశారు.



## భూ రీసర్వే పనులను
# వేగవంతం చేయండి

**నెలన్నరలోగా పూర్తి చేయాలి**
**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భూ రీసర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాతనగర్ రామవరం గరీబ్ పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి సర్వే పురోగతి భూహద్దుల నిర్ధారణ సర్వే నంబర్లు భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీసర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణ చేపట్టడంతో పాటు అటవీ భూముల హద్దులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల మేర అటవీ భూమి ఉన్నట్లు వివరించారు. సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ 20లో పట్టా అసైన్‌మెంట్ అటవీ భూములు కలిసి ఉన్నందున ఆయా భూముల హద్దులను రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ భూముల హద్దులు ఇప్పటికే నిర్ధారితంగా ఉన్న ప్రాంతాల్లో అనవసర జాప్యం లేకుండా మిగిలిన రీసర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పరిధిలో పోడు సాగు చేస్తున్న భూములు ఉన్నాయని అర్హులైన వారికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ కింద హక్కులు కల్పించినట్లు అధికారులు వివరించారు. సుమారు 420 మందికి పైగా పట్టాదారులు ఉన్నారని ఇందులో గిరిజనులు ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. రీసర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమై హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు. సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు వివరించారు. అక్కడ ఉన్న పాత సరిహద్దు రాళ్లు మ్యాప్‌లు రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతంగా చేపట్టి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# దమ్మక్కపేటలో సింగరేణి ఉచిత వైద్య శిబిరం..

- 84 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..
- ఏజీఎం ఎస్. రమేష్

**మణుగూరు, మహా :** సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మండలంలోని దమ్మక్కపేట గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా బొగ్గు గనుల పరిసర ప్రాంతాల గ్రామస్తులకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో స్త్రీలు, పురుషులు, వృద్ధులు, విద్యార్థులు కలిపి మొత్తం 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు చిన్నారులకు అవసరమైన మందులను సైతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యక్తిగత, గృహ పరిశుభ్రతను పాటించడంతో పాటు అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గనుల పరిసర గ్రామాల ప్రజలకు సింగరేణి వైద్యుల ద్వారా అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో సింగరేణి వైద్యుడు డాక్టర్ సుందన్, ఏరియా ఆస్పత్రి సిబ్బంది యు.భవాని, బి.నాగమణి, సేవా సమితి కోఆర్డినేటర్ మురళీశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఎం స్వరూపతో పాటు దమ్మక్కపేట గ్రామస్తులు పాల్గొన్నారు.




# క్యాన్సర్ బాధిత చిన్నారికి మిరాకిల్ మైండ్స్ విద్యార్థుల అండ

**రూ.40 వేల ఆర్థిక సాయం.. బాలుడు త్వరగా కోలుకోవాలని ప్రిన్సిపాల్ రత్నాకర్ ఆకాంక్ష**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 22: మహా :** విద్యతో పాటు మానవత్వం, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలనే సందేశాన్ని మిరాకిల్ మైండ్స్ - ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు ఆచరణలో చూపించారు. రక్త క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న చార్లెస్ ఫిన్నీ అనే చిన్నారి వైద్య ఖర్చుల కోసం రూ.40 వేల ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో సమకూర్చిన మొత్తాన్ని చిన్నారి కుటుంబానికి అందజేశారు.

**చిన్నారి త్వరగా కోలుకోవాలి: ప్రిన్సిపాల్ రత్నాకర్**

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మొంద్రు. రత్నాకర్ మాట్లాడుతూ.. రక్త క్యాన్సర్‌తో పోరాడుతున్న చార్లెస్ ఫిన్నీ చిన్నారి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అందించిన ఆర్థిక సహాయం చిన్నారి చికిత్సకు కొంతైనా తోడ్పాటుగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సేవాభావం, దయ, మానవత్వం, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు.

**అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన విద్య**

చదువు అంటే కేవలం పుస్తకాల జ్ఞానం మాత్రమే కాదని.. అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం కూడా నిజమైన విద్యలో భాగమేనని విద్యార్థులు తమ సేవా కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. మిరాకిల్ మైండ్స్ విద్యార్థుల సేవా దృక్పథాన్ని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులోనూ విద్యార్థులను వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ సమాజం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతామని పాఠశాల యాజమాన్యం తెలిపింది.




## ఆయుర్వేదంతో ఆరోగ్యం..
# యోగాతో శ్రేయస్సు

- 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో అవగాహన కార్యక్రమాలు

**సత్తుపల్లి, మహా :** ఆరోగ్య పరిరక్షణలో సంప్రదాయ వైద్య విధానాలు, యోగా, పరిశుభ్రత, సమతుల్య ఆహారం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ యునాని వైద్యశాల, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సంయుక్తంగా ఈ కార్యక్రమాలను చేపట్టాయి.మొక్కల పెంపకంతో.. పర్యావరణ పరిరక్షణపై అవగాహన సెప్టెంబర్ 21న మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, సమతుల్య ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు.

**యోగా వాక్‌తో ఆరోగ్య సందేశం**

సెప్టెంబర్ 22న ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు యోగా వాక్ నిర్వహించారు. ప్రతిరోజూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు తెలిపారు. సంప్రదాయ వైద్య విధానాలతో పాటు యోగా, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో యునాని వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ షీలా స్రవంతి, ఫార్మసిస్టులు సంతోష్ కుమార్, కె. శ్రీనివాసరావు, యోగా శిక్షకురాలు శాంతి, ఎస్ఎన్ఓ ప్రవీణ్ కుమార్, వంశీ పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- తియుతంగా నిమజ్జనం నిర్వహించాలి
- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు నిమజ్జన ప్రదేశాలు రద్దీ ప్రాంతాలు సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి రద్దీ నియంత్రణ వాహనాల రాకపోకలు పార్కింగ్ శోభాయాత్రల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ వాహనాల మళ్లింపు పార్కింగ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. శోభాయాత్రల్లో డీజేలు అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్ టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని నిమజ్జన సమయంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు రెస్క్యూ సిబ్బంది అత్యవసర సేవల బృందాలు రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో బ్లూకోట్స్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్ అగ్నిమాపక వైద్య రెవెన్యూ మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు.




గణేష్ మండపాల నిర్వాహకులు శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.




## 425 కిడ్నీ మార్పిడిలు విజయవంతం

- వయసుతో సంబంధం లేకుండా శస్త్రచికిత్సలు
- బ్లడ్ గ్రూప్ వేరైనా ఏబీఓ ఇన్‌కంపాటిబుల్ ట్రాన్స్‌ప్లాంట్

**రాజేంద్రనగర్, మహా:** హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్‌లో ఇప్పటివరకు 425 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి తెలిపారు. శంషాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కిడ్నీ మార్పిడి చికిత్సలో సాధించిన పురోగతిని వైద్యులు వివరించారు. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్త గ్రూప్ అనుకూలత కీలకంగా ఉంటుంది. అయితే రక్త గ్రూపులు వేర్వేరుగా ఉన్న రోగులకు కూడా ఏబీఓ ఇన్‌కంపాటిబుల్ ట్రాన్స్‌ప్లాంట్ విధానంలో విజయవంతంగా చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. వయస్సు కూడా కిడ్నీ మార్పిడికి తప్పనిసరి అడ్డంకి కాదని, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు సైతం విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ మురళీనాథ్ మాట్లాడుతూ డయాలసిస్ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, అనుకూల పరిస్థితుల్లో కిడ్నీ మార్పిడి రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచగలదని తెలిపారు. 425 మార్పిడులు కేవలం సంఖ్య కాదని, అనేక కుటుంబాలకు కొత్త ఆశను అందించాయని వైద్య బృందం పేర్కొంది.

# వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం

- బల్దియా కమిషనర్ వెంకన్న
- జిడబ్ల్యూ ఎంసీ పరిధిలో సుమారుగా 19 ప్రధాన చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లు
- 30 క్రేన్లు, 145 మంది గజ ఈతగాళ్లు, 500 మంది సిబ్బంది అందుబాటులో
- పోలీసులు, వివిధ శాఖలు, గణేష్ ఉత్సవ కమిటీల సమన్వయంతో పటిష్ఠ చర్యలు



**వరంగల్, కార్పొరేషన్ మహా :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బల్దియా కమిషనర్ టి. వెంకన్న నేడొక ప్రకటనలో తెలిపారు.నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భద్రత, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జి డబ్ల్యూ ఎం సి పరిధిలో సుమారు 8 వేల విగ్రహాలను నిమజ్జనం చేయుటకు గాను హన్మకొండలోని బంధం చెరువు, సిద్దేశ్వర గుండం, కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని భీమారం చెరువు, హసన్‌పర్తిలోని పెద్ద చెరువు, ఖాజీపేటలోని పరిగి కుంటతో పాటు వరంగల్ లోని చిన్నవడ్డేపల్లి, ఉడుసుగుట్ట, రంగా సముద్రం, రంగశాయిపేట, మామునూరు బేస్తం చెరువు, గీసుకొండలోని కట్టమల్లన్న చెరువు తదితర నిమజ్జన కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు, దీనికి తోడుగా చిన్నచిన్న చెరువులలో కూడా చిన్న విగ్రహాలు వేయుటకు ఏర్పాటుచేసినట్లు కమిషనర్ తెలిపారు. వినాయక విగ్రహాలు నిమజ్జన కేంద్రాలకు సురక్షితంగా చేరుకునేలా ప్రధాన రహదారుల్లోని గుంతలను పూడ్చడంతో పాటు, రహదారుల వెంట ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించినట్లు తెలిపారు. నిమజ్జన కేంద్రాల పరిసరాల్లో బుష్ కటింగ్, పారిశుద్ధ్య పనులు, చెరువుల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు వంటి పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బల్దియా ఆధ్వర్యంలో 500 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

నిమజ్జన సమయంలో భారీ విగ్రహాలను చెరువుల్లోకి తరలించేందుకు 30 క్రేన్లను అందుబాటులో ఉంచామని, ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వివిధ నిమజ్జన కేంద్రాల వద్ద 145 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు. భక్తులు నీటిలోకి వెళ్లకుండా అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు, తెప్పలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**ప్రత్యేక అధికారులకు బాధ్యతలు**

నిమజ్జన ఏర్పాట్లను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు బల్దియా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్‌ను ఓవరాల్ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు కమిషనర్ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంతోష్ బాబును వరంగల్ ప్రాంతానికి, రవి కుమార్‌ను హన్మకొండ ప్రాంతానికి ఓవరాల్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజయ్ కుమార్‌కు అండర్ రైల్వే జోన్, ఉరుసుగుట్ట, అగర్తల చెరువుల నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.ప్రతి నిమజ్జన కేంద్రం వద్ద డీఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏఈలు, కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు ఆయా కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి, పరిస్థితులను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టేలా బాధ్యతలు కేటాయించినట్లు వివరించారు.

**వివిధ శాఖల సమన్వయంతో పటిష్ఠ ఏర్పాట్లు**

నిమజ్జన కేంద్రాల వద్ద పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుద్దీకరణ, ప్రధాన కూడల్లో మంచినీటి సదుపాయం, రాకపోకలు, బారికేడింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కమిషనర్ తెలిపారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు బల్దియా అధికారులు, పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, రోడ్లు భవనాల, మత్స్య ఇరిగేషన్ తదితర ప్రభుత్వ శాఖలు, గణేష్ ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా 3ఉంచేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, సురక్షితంగా, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా నిర్వహించేందుకు భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు బల్దియా, పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ టి. వెంకన్న కోరారు. నిమజ్జన సమయంలో అధికారులు సూచించే భద్రతా నిబంధనలు పాటిస్తూ, ప్రజలందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## దమ్మక్కపేటలో సింగరేణి ఉచిత వైద్య శిబిరం..

- 84 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..
- ఏజీఎం ఎస్. రమేష్

**మణుగూరు, మహా :** సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మండలంలోని దమ్మక్కపేట గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా బొగ్గు గనుల పరిసర ప్రాంతాల గ్రామస్తులకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో స్త్రీలు, పురుషులు, వృద్ధులు, విద్యార్థులు కలిపి మొత్తం 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు చిన్నారులకు అవసరమైన మందులను సైతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యక్తిగత, గృహ పరిశుభ్రతను పాటించడంతో పాటు అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గనుల పరిసర గ్రామాల ప్రజలకు సింగరేణి వైద్యుల ద్వారా అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో సింగరేణి వైద్యుడు డాక్టర్ సుందన్, ఏరియా ఆస్పత్రి సిబ్బంది యు.భవాని, బి.నాగమణి, సేవా సమితి కోఆర్డినేటర్ మురళీశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఎం స్వరూపతో పాటు దమ్మక్కపేట గ్రామస్తులు పాల్గొన్నారు.



## కొత్త యంత్రాలు.. స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచాలి..

- పీకేఓసీ-2, కేఎచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి
- సింగరేణి యాజమాన్యానికి ఏఐటీయూసీ వినతి

**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థలో నూతన యంత్రాలు, వాటి విడిభాగాలతో పాటు కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. పీకేఓసీ2, కేసీఎచ్‌పీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంబంధిత ఉన్నతాధికారులకు మంగళవారం మెమోరాండం అందజేశారు. పీకేఓసీ 2, కేసీఎచ్‌పీలో నూతన వాహనాలు, యంత్రాల విడిభాగాలు, సేఫ్టీ పరికరాలు, అవసరానికి తగిన మ్యాన్‌పవర్ కొరతతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. డంపర్లు, డోజర్లు, షావల్స్‌తో పాటు వాటికి అవసరమైన స్పేర్ పార్ట్స్, రక్షణ పరికరాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని కోరారు. కేఎచ్‌పీలో రోలర్లు, బెల్టులు, ఐడ్లర్లు, బేరింగులు, ఇతర స్పేర్ పార్ట్స్‌తో పాటు కమ్యూనికేషన్ సిస్టమ్‌ను మెరుగుపరచాలని కోరారు. టెక్నీషియన్లకు అవసరమైన పనిముట్లు, కార్మికులకు లెదర్ షూలు, లాకర్లు, పీపీఈ కిట్లు సమకూర్చాలని, డస్ట్ సప్రెషన్ సిస్టమ్‌కు అవసరమైన స్పేర్ పార్ట్స్‌ను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యాలయాల్లో అవసరమైన కుర్చీలు, టేబుళ్లను సైతం ఏర్పాటు చేయాలని కోరారు. యంత్రాలు, విడిభాగాలు, రక్షణ పరికరాల కొరత ఉత్పత్తి, ఉత్పాదకతపై ప్రభావం చూపడంతో పాటు కార్మికులు సురక్షితంగా విధులు నిర్వహించేందుకు ఇబ్బందిగా మారుతోందని నాయకులు పేర్కొన్నారు. యాజమాన్యం సమస్యలను పరిశీలించి అవసరమైన సామగ్రిని సమకూర్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, జీఎం కమిటీ సభ్యుడు ఆవుల నాగరాజు, ఫిట్ సెక్రటరీలు ఎస్.కుమారస్వామి, జి.శ్రీనివాసరావు, ఉడుత శివ, నాయకులు బైరి వెంకటేశ్వర్లు, బీవీ సత్యనారాయణ, హుస్సేన్, నాగుల సతీష్, కోడిరెక్కల శ్రీనివాస్, వేణు, శ్రీనివాస్, కళ్యాణం రవి, వినయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుడి నిమజ్జనానికి పటిష్ట భద్రతా వలయం

- 850 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- మూడు ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- భారీ విగ్రహాలకు క్రేన్లు.. కీలక ప్రాంతాల్లో రూఫ్‌టాప్ నిఘా

**కరీంనగర్, మహా:** గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. కమిషనరేట్ పరిధిలో సుమారు 3,100 గణేష్ విగ్రహాలకు నిమజ్జనం జరగనుండగా, నగర పరిధిలోని దాదాపు 1,000 విగ్రహాల్లో 800కుపైగా ప్రధాన రహదారుల మీదుగా నిమజ్జన కేంద్రాలకు తరలివెళ్లనున్నాయి. భద్రత కోసం మొత్తం 850 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించినట్లు సీపీ గౌష్ ఆలం తెలిపారు. మానకొండూర్ చెరువు, చింతకుంట కెనాల్, కొత్తపల్లి చెరువులను ప్రధాన నిమజ్జన కేంద్రాలుగా గుర్తించారు. భారీ విగ్రహాల కోసం మానకొండూర్, చింతకుంట ప్రాంతాల్లో క్రేన్లు, లైటింగ్ ఏర్పాటు చేశారు. చెరువుల వద్ద బారికేడ్లు, గజ ఈతగాళ్లు, విపత్తు నివారణ బృందాల బోట్లు సిద్ధంగా ఉంచారు. ప్రధాన చౌరస్తాలు, సున్నిత ప్రాంతాల్లో స్టాటిక్ పికెట్లు, పెట్రోలింగ్ వాహనాలు, పుషింగ్ పార్టీలతో నిఘా ఏర్పాటు చేశారు. ఎత్తైన భవనాలపై రూఫ్‌టాప్ పోలీసు బృందాలను మోహరించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక డైవర్షన్లు అమలు చేయనున్నారు. సెప్టెంబర్ 23, 24 తేదీల్లో హుజురాబాద్, జగిత్యాల, సిరిసిల్ల వైపుల నుంచి కరీంనగర్‌కు వచ్చే గ్రానైట్ లారీలు, ఇతర భారీ వాహనాలకు అనుమతి ఉండదని పోలీసులు తెలిపారు. గాంధీచౌక్, రాజీవ్‌చౌక్, టవర్ సర్కిల్, కమాన్, కేబుల్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టనున్నారు. ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని సీపీ కోరారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల విషయంలో నిబంధనలు పాటించి శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రతిష్ఠించిన గణనాథునికి సీపీ గౌష్ ఆలం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.




## పెట్టుబడుల పేరుతో కోట్ల మోసం.. ముగ్గురు అరెస్ట్

- రెట్టింపు, మూడింతల లాభాలంటూ వల
- నెట్‌వర్క్ చైన్ విధానంలో భారీగా వసూళ్లు
- యూపీలో నిందితుల అరెస్ట్.. ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలింపు

**కరీంనగర్, మహా:** తక్కువ వ్యవధిలో పెట్టుబడులు రెట్టింపు, మూడింతలు చేస్తామంటూ ప్రజలను నమ్మించి కోట్లాది రూపాయలు వసూలు చేసి, ఆ తర్వాత చెల్లింపులు నిలిపివేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పెట్టుబడి మోసం కేసులో ముగ్గురిని కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రేయ ఇన్‌ఫ్రా అండ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌పేరుతో నిర్వహించిన పెట్టుబడి పథకాల వ్యవహారంలో ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్ రాయ్‌తో పాటు రాజేష్ కుమార్, బ్రిజేష్ కుమార్ మిశ్రాలను ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2020లో లక్నోలో సంస్థను ఏర్పాటు చేసిన నిందితులు వివిధ పెట్టుబడి పథకాలను ప్రవేశపెట్టారు. తక్కువ కాలంలో పెట్టిన మొత్తానికి భారీ లాభాలు వస్తాయని ప్రచారం చేస్తూ పెట్టుబడిదారులను ఆకర్షించినట్లు పోలీసులు తెలిపారు. నెట్‌వర్క్ చైన్ విధానంలో కొత్తగా చేరిన వారి నుంచి సేకరించిన మొత్తంలో కొంత భాగాన్ని పాత పెట్టుబడిదారులకు చెల్లిస్తూ మరింత మందిని పథకంలో చేర్చినట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.కరీంనగర్ జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో ఏజెంట్లను నియమించి పెద్ద మొత్తంలో పెట్టుబడులు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలం పాటు చెల్లింపులు చేసిన అనంతరం 2024 మే నుంచి వాటిని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. దీంతో పెట్టుబడిదారులు తమ డబ్బులు తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుడు గుగులోత్ శివరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ I టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాలతో దర్యాప్తును CCS కరీంనగర్‌కు బదిలీ చేశారు. CCS ఇన్‌స్పెక్టర్ ఆర్. ప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. దర్యాప్తులో భాగంగా యూపీకి వెళ్లిన ప్రత్యేక బృందం సెప్టెంబర్ 18 రాత్రి లక్నోలో నిందితులను అదుపులోకి తీసుకుంది. నేరానికి ఉపయోగించినట్లు పేర్కొన్న మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను లక్నో చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే సమీప పోలీస్ స్టేషన్ లేదా CCS కరీంనగర్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



## రైతు రిజిస్ట్రేషన్ ద్వారా నే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు అందుతాయి

- పంట రిజిస్ట్రేషన్ తప్పనిసరి...
- క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ మండలం రామానుజాపూర్ గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మంగళవారం రైతులకు వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి విత్తనాల ఎంపిక, విత్తన నాణ్యత, విత్తన శుద్ధి, నారుమడి, నెలలోపు నాట్లు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను, కాలిబాటల ఆవశ్యకత, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై చర్చించారు. శంషాబాద్ లో ఆర్ఎన్ఆర్ 15048 , ధనిష్ఠ, సౌభాగ్య విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తున్నారు. రైతులకు సూచనలు సలహాలు వారి సందేహాలను నివృత్తి చేశారు. రాజేంద్రనగర్ వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని, రసాయనిక ఎరువుల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి రైతులకు వివరించారు. ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి, సెప్టెంబర్ 22 నుండి 30 వరకు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. రైతు రిజిస్ట్రేషన్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, పంటల కొనుగోలు, ఎరువుల కొనుగోలు, పంట రుణాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా దగ్గరలోని మీ సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్వేత, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అరుణశ్రీ, లక్ష్మీప్రసన్న , ఏ ఈ ఓ లక్ష్మణ్, ఏటీఎం శ్రీవిద్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనంలో నిఘా.. భద్రతలో రాజీ లేదు

- గణనాథుడి వీడ్కోలుకు పకడ్బందీ ఏర్పాట్లు
- ట్రాఫిక్ నుంచి పారిశుద్ధ్యం వరకు ప్రత్యేక దృష్టి
- కొత్తపల్లి, చింతకుంటలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చిత్రామిశ్రా



**కరీంనగర్, మహా:** గణనాథుడి నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా ఆదేశించారు. భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మంగళవారం కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి కలెక్టర్ కొత్తపల్లి చెరువు, చింతకుంట కాల్వ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన పాయింట్ల వద్ద భక్తుల రాకపోకలు, వాహనాల నిర్వహణ, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీ విగ్రహాల తరలింపు సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. పోలీసులు నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. కొత్తపల్లి చెరువు వద్ద రెండు నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేసి చిన్న విగ్రహాలకు ప్రత్యేకంగా రెండో పాయింట్‌ను వినియోగించాలని సూచించారు. దీంతో రద్దీని తగ్గించి నిమజ్జన ప్రక్రియను వేగంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. చెత్త పేరుకుపోకుండా సిబ్బందితో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

**చదువులోనూ.. భద్రతలోనూ రాజీ వద్దు**

కరీంనగర్, మహా: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం రేకుర్తిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ గర్ల్స్ 1ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, సిక్‌రూమ్, హాస్టల్, భోజనశాలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. వారి చదువు, స్టడీ మెటీరియల్, వసతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ లక్ష్యాలను చేరుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. హాస్టల్ ప్రాంగణంలో నీరు నిలిచిపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ డ్రెయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గురుకులానికి సొంత భవనం ఏర్పాటు చేసే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ప్రిన్సిపాల్ మౌనిక సోనీని ఆదేశించారు. విద్యార్థినుల సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఉద్యమకారులను గుర్తించడానికి

## త్వరలో ప్రత్యేక వెబ్సైట్ ప్రారంభం

**భువనగిరి సెప్టెంబర్ 22 మహా న్యూస్ :** స్వరాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించడానికి తొందరలోనే ప్రత్యేక వెబ్సైటు పోర్టల్ ప్రారంభించడం జరుగుతుందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేస్తూ ఉద్యమకారులు ఎవరు అధర్య పడ వద్దని ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల సీరియస్ గా పనిచేస్తుందని గుర్తింపు కమిటీ కూడా ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తూనే ఉందని ఆయన అన్నారు తొందరలోనే వారం రోజుల లోపు ప్రత్యేక వెబ్సైటు ప్రారంభిస్తున్నట్లు సమాచారం ఉందని ఆయన అన్నారు ఉద్యమకారులు తమ దగ్గర ఉన్న బయోడేటాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు

## పేషెంట్ల సహాయకులకు వెయిటింగ్ హాల్

**హనుమకొండ, చౌరస్తా, మహా:** హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పేషెంట్ల సహాయకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాల్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. మెప్మా, జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ హాల్‌లో రోగుల సహాయకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఏళ్లుగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఆసుపత్రితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తాను కూడా ఇక్కడే జన్మించానని గుర్తుచేశారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, అధికారులు, పేషెంట్ల సహాయకులు పాల్గొన్నారు.

# రిమ్స్ ను సందర్శించిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి

- **ప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం**
- **నిర్లక్ష్యమని తేలితే కఠిన చర్యలు**
- **ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలి**
- **మరో 150 పడకలతో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనం ఏర్పాటు**
- **మరిన్ని అదనపు సేవలందించేందుకు చర్యలు**



**ఆదిలాబాద్ మహా :** రిమ్స్‌లో మాతా, శిశు సంరక్షణ సేవలను మరింత బలోపేతం చేసేందుకు 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రిమ్స్ ఎస్ఎన్‌సీయూ వార్డులో ప్రమాద ఘటన నేపథ్యంలో మంగళవారం ఆయన ఆసుపత్రిని సందర్శించారు. అగ్నిప్రమాదం జరిగిన నవజాత శిశు వార్డును పరిశీలించారు. ప్రమాద సమయంలో చేపట్టిన సహాయక చర్యలు, చిన్నారుల ప్రస్తుత వైద్య పరిస్థితి, చికిత్స అందుతున్న విధానం, తీసుకున్న తక్షణ చర్యలపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రిమ్స్ అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, రిమ్స్ వైద్యులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ప్రమాద ఘటన చాలా బాధాకరమన్నారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి, ఏసీకి సంబంధించిన ప్లాస్టిక్ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించినట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. అయితే ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర విచారణ అనంతరం పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు.ప్రమాదం జరిగిన వెంటనే రిమ్స్ సిబ్బంది, జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక, పోలీసు శాఖలు సమన్వయంతో స్పందించి, చికిత్స పొందుతున్న నవజాత శిశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ప్రభావిత చిన్నారులకు అత్యవసర వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం బాధాకరమని మంత్రి తెలిపారు. ప్రభావిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అవసరమైన చోట స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల సహకారాన్ని కూడా తీసుకున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం రిమ్స్‌లో సుమారు 800 పడకలు ఉన్నాయని, అదనంగా 150 పడకల ఎం సి ఎచ్ భవనం ఏర్పాటు చేయడం ద్వారా రిమ్స్‌ను సుమారు 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. దీని వలన ప్రసూతి సేవలు, తల్లుల సంరక్షణ, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రిమ్స్‌లో పలు కొత్త విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. థలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా వంటి వ్యాధులకు మెరుగైన వైద్యం అందించేందుకు హెమటాలజీ విభాగం, రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రిమ్స్‌లో పీజీ వైద్య విద్యార్థుల సంఖ్య, ఓపీ, ఐపీ సేవలను పెంచడంతో పాటు పీడియాట్రిక్స్, గైనకాలజీ, రేడియాలజీ తదితర విభాగాల్లో పీజీ సీట్ల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ కోసం నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా లోపాలు, నిర్వహణలో లోపాలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. రిమ్స్‌లో కింది మూడు కీలక సేఫ్టీ ఆడిట్‌లను నిర్వహించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్, ఫైర్ సేఫ్టీ ఆడిట్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్ నిపుణుల కమిటీ నివేదిక, సేఫ్టీ ఆడిట్‌ల ఆధారంగా రిమ్స్‌లో అవసరమైన మరమ్మతులు, అదనపు మౌలిక వసతులు, పునరుద్ధరణ పనులు, కొత్త భవనాల నిర్మాణం, అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలపై సమగ్ర అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని మంత్రి తెలిపారు. రిమ్స్‌లో మెయింటెనెన్స్, మానిటరింగ్, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తామని చెప్పారు. విచారణలో ఎవరి నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం బయటపడినా, నిబంధనల ప్రకారం తగిన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రిమ్స్‌లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన మానవ వనరులను సమకూర్చడం, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ఆస్పత్రిలో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్టం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ,వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చాంగ్తూ, డీఎంఏ వాణి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో మంద మకరంద్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు ,రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో సాధన, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## బాధలో బాసటగా.. కంది శ్రీనివాస రెడ్డి పరామర్శ

**బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం**

**ఆదిలాబాద్ మహా :** ఆపదలో ఉన్నా , అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసినా , ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నారని సమాచారం అందినా వారి నివాసాలకు వెళ్ళి కొండంత అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. మంగళవారం బేల మండలం సిర్సన్న గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆకాశ్ బాబ్దే నివాసాన్ని సందర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు.






## విద్యార్థుల నృత్య ప్రదర్శన

**ఆదిలాబాద్ మహా:** శిఖరం థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర సంగీత నాట్య కళానిలయం విద్యార్థులు తమ ప్రతిభను చాటారు.కూచిపూడి నృత్యం, వీణ విభాగాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు తమ ప్రతిభకు విశిష్టమైన గుర్తింపును అందుకున్నారు.కూచిపూడి నృత్య విద్యార్థులకు సిద్ధేంద్ర యోగి మెమెంటోలు అందజేసి సత్కరించారు. ప్రతిభ కనబరిచిన సీనియర్ నృత్య విద్యార్థులకు అత్యుత్తమ ప్రదర్శనకు గుర్తింపుగా నృత్య రత్న బిరుదును, తమ ప్రత్యేక ప్రతిభతో రాణించిన జూనియర్ విద్యార్థులకు నాట్య చంద్రిక బిరుదును ప్రదానం చేశారు. అదేవిధంగా వీణా విద్యార్థులను వీణా విపంచి బిరుదులతో సత్కరించారు.అలాగే శ్రీ వెంకటేశ్వర సంగీత నాట్య కళానిలయం గురువు కవిత ను ప్రతిష్ఠాత్మక నాట్య తపస్వి బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా. శ్యామల, డా. జీవిత , వ్యవసాయ అధికారి కీర్తి తదితరులు హాజరై విద్యార్థులను అభినందించి, వారి ప్రతిభను ప్రోత్సహించారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన బెల్లంపల్లి విద్యార్థి

**జాతీయస్థాయి అండర్ 16 సాఫ్ట్వేర్ పోటీలకు ఎంపికైన బద్రి తాండవ కృష్ణ**

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణం పాలిటెక్నిక్ ఏరియా 2వ వార్డు నివాసి పాత్రికేయుడు బద్రి వెంకటేశ్వర్లు కుమారుడు బద్రి తాండవ కృష్ణ జాతీయ స్థాయి అండర్ 16 సాఫ్ట్బాల్ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి దేబ్బేటి రమేష్ ఆధ్వర్యంలో పలువురు నేతలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి సత్కరించారు ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ పోటీలలో రాణించి బెల్లంపల్లి పట్టణానికి వన్నె తెచ్చే విధంగా ప్రతిఫలం ప్రదర్శించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో విజయం సాధించడానికి ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరం అని జాతీయ స్థాయి పోటీలలో తన అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజయాన్ని సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మొండి,పట్టణ కార్యదర్శి, ఆచ్చిన సాయి కిరణ్ యాదవ్, నాయకులు శనిగల శంకర్, రామ్ శెట్టి మల్లయ్య, భూక్య శ్రీనివాస్ లు పాల్గొన్నారు.





## భీమిని మండలం లో ఏసీబీ కి చిక్కిన జిపివో

- **రూ. 80 వేలు లంచం తీసుకుంటూ ఉండగా పట్టుకున్న ఆదిలాబాద్ ఎసిబి డిఎస్పి మధు**

**బెల్లంపల్లి, మహ**: మంచిర్యాల జిల్లా భీమిని మండలంలో ఉమ్మడి ఆదిలాబాద్ ఏసిబి అధికారుల దాడి స్థానికంగా సంచలనం సృష్టించింది. భీమిని మండలంలోని పెద్దంపేట గ్రామానికి చెందిన మహమ్మద్ ఫకీర్ అనే రైతుకు సంబంధించిన సాదాబైనామా పట్టా మార్పిడి చేయించేందుకు జీపీవో దుర్గాప్రసాద్ బాధితుడిని లంచం డిమాండ్ చేయగా తొలత 20వేల రూపాయలను ఇదివరకు ఇచ్చినప్పటికి మరో దఫాలో రూ.80000 లో చెల్లించాలని జిమాండ్ చేయడంతోడిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడం జరిగింది, ఏసీబీ అధికారుల సూచనల మేరకు పథకం ప్రకారంగా మంగళవారం లంచం వ్యవహారం నడిచింది. మహమ్మద్ ఫకీర్ నుంచి రూ. 80,000 లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలోని సిబ్బంది దాడి చేసి దుర్గాప్రసాద్ను అదుపులోకి తీసుకున్నారు.బయట లంచం తీసుకుంటుండగా పట్టుకుని అతన్ని దీనిని తాసిల్దార్ కార్యాలయానికి తరలించారు. జీపీవో వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డిఎస్పి మధు వెల్లడించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిపిఓ దుర్గాప్రసాద్ పట్టా చేసేందుకు లక్ష 80 వేల రూపాయలను డిమాండ్ చేయగా లక్ష 30 వేల రూపాయలకు ఒప్పుకొని తొలి దఫాలో 20000 రూపాయలను రెండవ దఫాలో 80 వేల రూపాయలను చెల్లించేందుకు ఒప్పుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించడం జరిగిందని వెల్లడించారు. లంచం తీసుకుంటున్న క్రమంలో సంబంధిత జిపిఓ దుర్గాప్రసాద్ను పట్టుకోవడం జరిగిందని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తికాగానే కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు, ప్రభుత్వ విధుల్లో అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఏసీబీ అధికారులు హెచ్చరించారు. . ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ప్రజలకు సేవ చేయాలే తప్ప లంచం కావాలని ఎవరైనా డిమాండ్ చేసిన క్రమంలో ఏసీబీ శాఖను సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.



## వార్షిక తిథికి హాజరైన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి దంపతులు మంగళవారం బేల మండలం సిర్సన్న గ్రామాన్ని సందర్శించారు. ఆయన బావమరిది గడ్డం అఖిల్ రెడ్డి నివాసంలో జరిగిన ప్రథమ వార్షికోత్సవ తిథికి హాజరయ్యారు. అఖిల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు కొండ గంగాధర్, కోలా నర్సింలు, లోక ప్రవీణ్ రెడ్డి , ఇజ్జగిరి సంజయ్, సాహిద్ అలీ, రఫీఖ్, ఎంఏ షకీల్, అల్చెట్టి నాగన్న తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి కి హెలీ ప్యాడ్ వద్ద ఘౌ స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్ మహా: రిమ్స్ ఎస్ఎన్ సీయూ వార్డ్ లో ప్రమాద ఘటన నేపథ్యంలో రిమ్స్ సందర్శనకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహకు పట్టణంలోని ఏరోడ్రమ్ హెలీప్యాడ్ వద్ద ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి స్వాగతం పలికారు




## విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ప్రభుత్వ విప్

**పెద్దపల్లి మహా, సుల్తానాబాద్**: మండలంలోని గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహించిన అల్పాహార కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంగళవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో హరే రామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విజయరమణారావు విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. వారితో సరదాగా ముచ్చటిస్తూ చదువు, పాఠశాలలోని సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించగలరని, పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని చేపట్టిన హరే రామ కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు రైతు మృతి



**పెద్దపల్లి మహా ఓదెల:** పిడుగుపాటుకు రైతు మృతి చెందిన విషాద ఘటన ఓదెల మండలం కొలనూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు జంగా సుధాకర్‌రెడ్డి (65) వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పొలంలో పని చేస్తుండగా ఆయన సమీపంలో అకస్మాత్తుగా పిడుగు పడింది.ఈ ఘటనలో సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. రైతు మృతితో కొలనూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# ఉప్పల్ అభివృద్ధిపై కమిషనర్‌తో ఎమ్మెల్యే చర్చ

- మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యంపై సమీక్ష
- పెండింగ్ పనులు వేగవంతం చేయాలని సూచన

**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎంఎంసీ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని బండారి లక్ష్మారెడ్డి సూచించారు.



# వీర సైనికుడు కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డికి ఘన నివాళులు

- 49వ జయంతి సందర్భంగా విగ్రహానికి పుష్పాంజలి
- దేశ సేవలో వీరుల త్యాగాలు చిరస్మరణీయమన్న ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా:** వీర సైనికుడు కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డి 49వ జయంతి సందర్భంగా హబ్సిగూడలోని వీర రాజా రెడ్డి మార్గ్‌లో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డి ధైర్యం, దేశభక్తి, త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ సేవలో ప్రాణాలను అర్పించిన వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో హబ్సిగూడ ప్రాంత వాసులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొని కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

# మల్కాజిగిరి కమిషనరేట్‌పరిధిలో మద్యం దుకాణాలు బంద్

**25న ఉదయం 6 నుంచి 26న సాయంత్రం 6 వరకు విక్రయాలు నిలిపివేత**

**కుషాయిగూడ, మహా :** హైదరాబాద్‌లో గణేష్ విగ్రహాల తుది నిమజ్జనం నేపథ్యంలో మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఈ నెల 25న ఉదయం 6 గంటల నుంచి 26న సాయంత్రం 6 గంటల వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయనున్నారు. ఆయా దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాల నిర్వాహకులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపడుతోంది. నిమజ్జనం సమయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. నిర్దేశిత సమయాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించినా, అనుమతులు లేకుండా మద్యం అందించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ అధికారులు స్పష్టం చేశారు.







# రాజస్థాన్ నుంచి మల్కాజిగిరికి డ్రగ్స్

- 23 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం
- ఇద్దరు అరెస్ట్.. సరఫరాదారుడు కుల్దీప్ పరారీ

**కుషాయిగూడ, మహా :** మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తితో పాటు వినియోగదారుడిని ఎస్‌ఓటీ మల్కాజ్‌గిరి జోన్, మల్కాజ్‌గిరి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 23 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, రెండు సెల్‌ఫోన్లు, రూ.5,600 నగదు, ఒక హ్యాండ్‌బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.2.76 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మహావీర్ సింగ్ (28) హైదరాబాద్‌లో రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి ఎండీఎంఏను తీసుకువచ్చి హైదరాబాద్‌లో వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మణ్ సింగ్ రాజ్‌పురోహిత్ (45) క్యాటరింగ్ పనులు చేస్తుండగా, మహావీర్‌కు స్నేహితుడిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అతను ఎండీఎంఏ వినియోగదారుడిగా ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 21 మధ్యాహ్నం మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ సమీపంలోని వేప చెట్టు వద్ద ఇద్దరు అనుమానితులు వేచి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, సాక్షుల సమక్షంలో తనిఖీ చేయగా హ్యాండ్‌బ్యాగ్‌లో పాలిథిన్ కవర్లలో దాచిన ఎండీఎంఏ లభ్యమైంది. పరీక్షల్లో అది 23 గ్రాముల ఎండీఎంఏగా నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో రాజస్థాన్ జోధ్‌పూర్‌కు చెందిన కుల్దీప్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు, కోకాపేట్‌కు చెందిన కైలాష్ మరో వినియోగదారుడిగా ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వీరిద్దరూ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# వరంగల్ ఎంజీఎంలో హైటెన్షన్

- మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను అడ్డుకున్న పోలీసులు
- బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట
- పెనుగులాటలో గాయాలయ్యాయని వినయ్‌భాస్కర్ వర్గం వెల్లడి



**వరంగల్, ఎంజీఎం, మహా:** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రిలో రోగుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్ మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు ప్రధాన గేటు వద్ద అడ్డుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వినయ్‌భాస్కర్ కాలు, చేతికి గాయాలై రక్తస్రావం జరిగినట్లు ఆయన అనుచరులు తెలిపారు.ఇటీవల ఎంజీఎం ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడిపడి పలువురు గాయపడిన ఘటన కలకలం రేపింది. దీనిపై బీజేపీ నాయకులు ఆస్పత్రిని సందర్శించిన మరుసటి రోజే మరో వార్డులోనూ పెచ్చులు ఊడిపడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో భవనాల పరిస్థితి, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించేందుకు వినయ్‌భాస్కర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎంజీఎంకు వచ్చారు. అయితే అనుమతి లేదంటూ పోలీసులు ఆయనను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. రోగులను పరామర్శించేందుకు అనుమతించాలని కోరినా పోలీసులు నిరాకరించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో కార్యకర్తలు ప్రధాన గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో గాయపడిన వినయ్‌భాస్కర్‌కు చికిత్స అందించారు. పోలీసుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎంలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, భవనాల భద్రత, బెడ్లు, అంబులెన్స్‌ల కొరత వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, గేటు వద్ద దాదాపు గంటపాటు ఉద్రిక్తత కొనసాగింది.



# సమతామూర్తి క్షేత్రంలో సరికొత్త అనుభూతి

**ఏఆర్, వీఆర్, ఎంఆర్, ఎక్స్‌ఆర్ టెక్నాలజీతో వినూత్న సేవలు**

**రాజేంద్రనగర్, మహా:** సమతామూర్తి క్షేత్రంలో సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు 4.2 టెక్నాలజీస్ ఆధునిక సేవలను మంగళవారం ప్రారంభించింది. సంస్థ ఫౌండర్, ఎండీ కే. శివకుమార్ బృందంతో కలిసి త్రిదండి చినజీయర్ స్వామీజీ ఈ సేవలను ప్రారంభించారు. ఏఆర్, వీఆర్, ఎంఆర్, ఎక్స్‌ఆర్ సాంకేతికతల ద్వారా క్షేత్ర చరిత్ర, ఆధ్యాత్మికత, సంస్కృతి, శిల్పకళకు సంబంధించిన అంశాలను ఇంటరాక్టివ్‌గా సందర్శకులకు అందించనున్నారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామీజీ మాట్లాడుతూ రామానుజాచార్యుల చరిత్ర, సామాజిక సేవలను నేటి తరానికి అర్థమయ్యేలా అందించడం అవసరమన్నారు. శివకుమార్ మాట్లాడుతూ పర్యాటకం కేవలం సందర్శనకే పరిమితం కాకుండా, చరిత్రను అనుభవించేలా ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామని తెలిపారు. భౌతిక అనుభవాన్ని మరింత ఆసక్తికరంగా మార్చడమే తమ లక్ష్యమన్నారు.

# ఇబ్రహీంపట్నంలో దంత వైద్య శిబిరం

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 22** మహా:ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హాల్లో దంత వైద్య శిబిరం నిర్వహించారు. డిఎంహెచ్ఓ డా. స్వర్ణకుమారి, కౌన్సిలర్ యాదగిరి శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 150 మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, సిహెచ్సి సూపరింటెండెంట్ డా.శ్రీలత, డిప్యూటీ సివిల్ సర్జన్ డా. లక్ష్మీ ప్రసన్న, దంత వైద్య నిపుణులు డా.శ్రీలక్ష్మి, డా. కీర్తి, డా. ఉషాశ్రీ, పిపి యూనిట్ డా.సమీరా అస్రా, తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**రాజేంద్రనగర్, మహా:** మహేశ్వరం మండలం బాలాపూర్‌లో కొలువుదీరిన గణనాథుడిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన మండపం ఈసారి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒడిశాలోని ప్రసిద్ధ పూరీ జగన్నాథ స్వామి ఆలయాన్ని పోలిన రీతిలో మండపాన్ని రూపొందించారు. మండపాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు

- 500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా

**పెద్దపల్లి, మహా:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 5,189 గణేష్ విగ్రహాలు ఉండగా, పెద్దపల్లి జోన్‌లో 36, మంచిర్యాల జోన్‌లో 41 నిమజ్జన ప్రాంతాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. బందోబస్తు కోసం సుమారు 500 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు, సీసీ కెమెరాలు, ఫ్లడ్‌లైట్లు, క్రేన్లు, ప్లాట్‌ఫారాలు, మంచినీటి వసతి, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. శోభాయాత్రలను డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. చిన్నారులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. డీజేలు, బాణాసంచా వినియోగం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.



# హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ను హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

**బెల్లంపల్లి మహా:** రాష్ట్రంలో హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని హైదరాబాదులోని బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్ లో మంగళవారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తో కలిసి కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ను తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిసి హమాలి సంక్షేమ బోర్డు ఏర్పాటుపై సమావేశంను నిర్వహించడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర హమాలి యూనియన్ కార్యదర్శి గెల్లీ రాయలింగు వెల్లడించారు. ఈ సందర్భంగా హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటుకై తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ నుండి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంటి సామ్రాజ్యం, అన్నెడి వెంకట్ రెడ్డి, ఎస్ వి శివ కుమార్, కన్నెగంటి రవి (రైతు స్వరాజ్య వేదిక) ఎస్ కే. సల్లావుద్దీన్ ఐదుగురు సభ్యులను కమిటీకి ఎంపిక చేసి కార్మిక శాఖకు రాష్ట్ర మంత్రివర్యులు గడ్డం వివేక్ పంపించినట్లు తెలిపారు. . ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి యూనియన్ నాయకులతో బోర్డు విధి విధానాలపై చర్చించి మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల హమాలి సంక్షేమ బోర్డు తరహాలో విధి విధానాలను త్వరగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగ సంపత్, కార్యదర్శి గెల్లి రాయలింగు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లచ్చన్న (నాగర్ కర్నూల్ బజార్), రాజు (మూసాపేట రైల్వే గూడ్ షెడ్ అధ్యక్షులు), భాస్కర్ (అచ్చంపేట బజార్) తదితరులు పాల్గొన్నారు

# అంజనీపుత్ర గణేష్ మండలిని సందర్శించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఘనంగా విఘ్నేశ్వరుడి ప్రత్యేక పూజలు**
**జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం పట్టణంలోని అంజనీపుత్ర గణేష్ మండలిని సందర్శించారు. అక్కడ కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపానికి చేరుకున్న కలెక్టర్ కుమార్ దీపక్‌కు నిర్వాహకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారికి పట్టువస్త్రాలు, ఫలాలు సమర్పించిన కలెక్టర్, దేశప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు కలెక్టర్‌కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఆధ్యాత్మిక శోభతో జరుపుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి అధికారులు, మండలి నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర మండప నిర్వాహకులు గుర్రాల శ్రీధర్ తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విచారణ ఖైదీ పరార్

**కుషాయిగూడ, మహా :** చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న శివశంకర్‌రెడ్డి పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లా అమరచింత మండలం ఆత్మకూరుకు చెందిన శివశంకర్‌రెడ్డి దొంగతనం కేసులో గత ఆరు నెలలుగా రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్నాడు. జైలు నుంచి అతడు పరారవడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జైలు అధికారులు, పోలీసులు పరారైన ఖైదీ ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అతడు ఎలా తప్పించుకున్నాడనే దానిపై కూడా అధికారులు విచారణ చేస్తున్నారు.

# ఆసియా కప్‌కు జిల్లా క్రీడాకారిణి

- రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**హనుమకొండ, మహా:** హనుమకొండ జిల్లాకు చెందిన యువ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి వెల్పుల సాయి వర్షిణి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. చైనాలోని వుక్సీ నగరంలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న 5వ అండర్15 ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ ఆసియా కప్2026లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా సాయి వర్షిణి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని కలిశారు. క్రీడాకారిణి ప్రతిభను గుర్తించిన ఆయన తన ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెనుకడుగు వేయకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. ఆసియా కప్‌లో సాయి వర్షిణి అద్భుతంగా రాణించి దేశానికి పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఇతర దాతలు, క్రీడాభిమానులు కూడా ఆమెను ప్రోత్సహించాలని కోరారు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

మంచిర్యాల, మహా : మంచిర్యాల జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అధికారులను ఆదేశించారు. మంగళవారం చెన్నూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో మండల తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులతో (బి.ఎల్.వో) ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు హియరింగ్ (విచారణ) ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఓటర్ల నుంచి వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులకు స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎటువంటి జాప్యం లేకుండా వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా అన్ని ప్రక్రియలను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం

**లక్షెట్టిపేట, మంచిర్యాల, మహా**: వినాయక నిమజ్జన వేడుకలను మతసామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం లక్షెట్టిపేట మండలంలోని గూడెం తదితర నిమజ్జన ప్రాంతాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. చెరువుల్లోకి ప్రజలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వాహనాల రద్దీకి అనుగుణంగా పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని తెలిపారు. నిమజ్జనం అనంతరం పూజా సామగ్రి, వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.




# నంది అవార్డులకు మళ్లీ ముహూర్తం

**అమరావతి, మహా:** తెలుగు సినీ, టెలివిజన్ రంగాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులకు అందించే ప్రతిష్ఠాత్మక నంది అవార్డుల ప్రదానోత్సవాలకు మళ్లీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న అవార్డులను నిర్వహించడంతో పాటు, రాబోయే సంవత్సరాల పురస్కారాల ప్రక్రియను కూడా ముందుకు తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2012 నుంచి 2016 వరకు పెండింగ్‌లో ఉన్న నంది ఫిల్మ్, టీవీ అవార్డులను అందించడంతో పాటు, 2017 నుంచి 2024 వరకు ఉన్న కాలానికి ప్రత్యేక విధానంలో పురస్కారాలు ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు. 2017 నుంచి 2024 వరకు ఎనిమిదేళ్ల కాలానికి సంబంధించిన అవార్డుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని అనుసరించనుంది. ప్రతి ఏడాదికి ఉత్తమ ఫీచర్ ఫిల్మ్, ద్వితీయ ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌తో పాటు రెండు ప్రత్యేక జ్యూరీ అవార్డులను అందించనున్నట్లు వెల్లడించింది. టెలివిజన్ విభాగంలోనూ ఇదే తరహాలో ప్రతి ఏడాదికి ఉత్తమ, ద్వితీయ ఉత్తమ మెగా సీరియళ్లతో పాటు రెండు ప్రత్యేక జ్యూరీ పురస్కారాలను ఇవ్వనున్నారు. ఈ నిర్ణయానికి సంబంధించిన జ్యూరీ కమిటీల ఏర్పాటును పూర్తి చేసి, విజేతల ఎంపిక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనున్నారు. ఇదిలా ఉండగా.. 2012 నుంచి 2016 వరకు గతంలో ప్రకటించి నిలిచిపోయిన అవార్డుల ప్రదానంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆ కాలానికి సంబంధించిన సినీ, జ్యూరీ, టెలివిజన్ విభాగాల పురస్కారాలను అందించేందుకు చర్యలు చేపడుతోంది. దీంతో దాదాపు దశాబ్ద కాలంగా అవార్డుల కోసం ఎదురుచూస్తున్న పలువురు కళాకారులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందే అవకాశం ఏర్పడింది.

2025 సంవత్సరానికి సంబంధించిన నంది అవార్డులను కూడా సాధారణ విధానంలో కొనసాగించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. భవిష్యత్తులో అవార్డుల నిర్వహణను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. నంది అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమలో నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణుల ప్రతిభను గుర్తించే ప్రభుత్వ పురస్కారాలుగా కొనసాగుతున్నాయి.వేదికల విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నంది ఫిల్మ్ అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని అమరావతి లేదా విజయవాడ ప్రాంతంలో నిర్వహించనున్నారు. టెలివిజన్ నంది అవార్డుల వేడుకకు తిరుపతిని వేదికగా నిర్ణయించినట్లు అధికారిక సమాచారం వెల్లడిస్తోంది. మొత్తం అవార్డు కార్యక్రమాలను 2026 డిసెంబర్‌లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

నంది అవార్డుల పునరుద్ధరణతో తెలుగు సినీ, టెలివిజన్ రంగాల్లో మరోసారి పురస్కారాల సందడి నెలకొనే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పెండింగ్‌లో ఉన్న అవార్డుల ప్రక్రియకు ముగింపు పలకడంతో పాటు, భవిష్యత్తులో అవార్డుల ప్రదానాన్ని క్రమం తప్పకుండా నిర్వహించే దిశగా చర్యలు సాగుతున్నాయి.

# పింక్ చీరలో ఈషాన్య

**మహా: నటి,** మోడల్ ఈషాన్య మహేశ్వరి మరోసారి తన అందమైన లుక్‌తో సోషల్ మీడియా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. సంప్రదాయ చీరకట్టులో ఆమె చేసిన తాజా ఫొటోషూట్ ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. లైట్ పింక్ షేడ్ చీరలో కనిపించిన ఈషాన్య.. సింపుల్‌గా, అదే సమయంలో ఆకర్షణీయంగా కనిపించేలా తన లుక్‌ను తీర్చిదిద్దుకుంది. చీరలోని సున్నితమైన డిజైన్లకు అనుగుణంగా ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న బ్లౌజ్‌ను జత చేయడంతో మొత్తం లుక్‌కు ప్రత్యేకమైన అందం వచ్చింది. చీరకట్టులో భాగంగా సంప్రదాయ స్టైలింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చిన ఈషాన్య.. ఆభరణాల ఎంపికలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపించింది. చెవులకు అందమైన డ్రాప్ ఇయర్‌రింగ్స్ ధరించడంతో పాటు చేతులకు పింక్ టోన్‌కు సరిపోయే బ్యాంగిల్స్‌ను ధరించింది. మెడలో సింపుల్ నెక్‌పీస్‌తో లుక్‌ను బ్యాలెన్స్ చేసింది. ఎక్కువ ఆభరణాలు ఉపయోగించకుండా మినిమల్ స్టైలింగ్‌ను ఎంచుకోవడం ద్వారా చీర అందం, తన వ్యక్తిత్వం రెండూ హైలైట్ అయ్యేలా చూసుకుంది. హెయిర్‌స్టైల్ విషయంలోనూ ఈషాన్య కొత్త తరహా లుక్‌ను ఎంచుకుంది. వేవీ హెయిర్‌ను ఓపెన్‌గా వదిలి, సహజమైన మేకప్‌తో ఫొటోలకు పోజులిచ్చింది. కళ్లకు ప్రాధాన్యం ఇచ్చే మేకప్‌తో పాటు పెదవులకు లైట్ షేడ్‌ను ఉపయోగించడంతో మొత్తం లుక్ మరింత ఎలిగెంట్‌గా కనిపించింది. మిర్రర్ సెల్ఫీతో పాటు వివిధ యాంగిల్స్‌లో తీసుకున్న ఫొటోలను అభిమానులతో పంచుకోవడంతో ఈ చిత్రాలకు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. సాధారణంగా వెస్ట్రన్, మోడ్రన్ దుస్తుల్లో కనిపించే సినీ తారలు అప్పుడప్పుడు సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తే అభిమానుల నుంచి ప్రత్యేకమైన స్పందన వస్తుంటుంది. ఈషాన్య మహేశ్వరి విషయంలోనూ ఇదే కనిపిస్తోంది. లైట్ పింక్ చీర, డిజైనర్ బ్లౌజ్, సింపుల్ యాక్సెసరీస్ కలయిక ఆమె లుక్‌కు ట్రెడిషనల్‌తో పాటు మోడ్రన్ టచ్‌ను తీసుకొచ్చింది. ముఖ్యంగా పింక్ షేడ్ చీరకు సరిపోయే ఆభరణాలు, హెయిర్‌స్టైల్ ఎంపిక ఫొటోషూట్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. ఈషాన్య మహేశ్వరి సినీ రంగంతో పాటు మోడలింగ్, సోషల్ మీడియా కంటెంట్ ద్వారా కూడా ప్రేక్షకులకు పరిచయమైంది. వివిధ ఫొటోషూట్లు, ఫ్యాషన్ లుక్స్‌తో తన ఫాలోవర్లను ఆకట్టుకుంటూ ఉంటుంది. సినిమాల్లో కనిపించే పాత్రలకు భిన్నంగా ఫొటోషూట్లలో తన ఫ్యాషన్ సెన్స్‌ను ప్రదర్శించడం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. అందులో భాగంగానే తాజాగా సంప్రదాయ చీరకట్టులో చేసిన ఈ ఫొటోషూట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈషాన్య తన ఫొటోలు, వీడియోలను తరచూ అభిమానులతో పంచుకుంటుంది. ఆమె పోస్టులకు నెటిజన్ల నుంచి కామెంట్లు, లైకులు వస్తుంటాయి. తాజాగా లైట్ పింక్ చీరలో ఉన్న ఫొటోలు కూడా అదే విధంగా వైరల్ అవుతున్నాయి. సంప్రదాయ వస్త్రధారణకు ఆధునిక ఫ్యాషన్‌ను జోడించిన ఈ లుక్ ప్రస్తుతం ఆమె అభిమానుల్లో ప్రత్యేకంగా నిలుస్తోంది.







# ది ప్యారడైజ్‌లో కయాదు షాక్

**మహా:** నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఇందులోని పాత్రలు, కథకు సంబంధించిన కొత్త విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ముఖ్యంగా కథానాయిక కయాదు లోహర్ పోషిస్తున్న సుబ్బలక్ష్మి పాత్రపై ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ప్పటివరకు క్యూట్, బబ్లీ లుక్స్‌తో ప్రేక్షకులకు దగ్గరైన కయాదు.. ఈ సినిమాలో మాత్రం అందుకు భిన్నమైన ఛాయలున్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. 'ది ప్యారడైజ్'లో తన పాత్ర గురించి తాజాగా కయాదు లోహర్ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. సాధారణ కమర్షియల్ సినిమాల్లో కథానాయికల పాత్రలు ఎక్కువగా హీరో చుట్టూనే తిరుగుతుంటాయని, కానీ ఈ చిత్రంలో తన క్యారెక్టర్‌కు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉందని ఆమె తెలిపింది. సుబ్బలక్ష్మి పాత్రలో కేవలం ప్రేమకథకు పరిమితమైన హీరోయిన్‌గా కాకుండా, కథను ప్రభావితం చేసే పలు అంశాలు ఉంటాయని చెప్పింది. ముఖ్యంగా పాత్రలో పాజిటివ్, నెగెటివ్ లక్షణాల మేళవింపు ఉండటంతో పాటు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సందర్భాలు కూడా ఉంటాయని పేర్కొంది. ఇప్పటివరకు తాను చేసిన పాత్రలతో పోలిస్తే సుబ్బలక్ష్మి పాత్ర పూర్తిగా భిన్నమైనదని కయాదు తెలిపింది. ఈ పాత్రను అంగీకరించడం, తెరపై దాన్ని ఆవిష్కరించడం తనకు సవాలుగా అనిపించిందని చెప్పింది. పాత్రలోని భావోద్వేగాలు, స్వభావాన్ని సరిగ్గా చూపించేందుకు ప్రత్యేకంగా సిద్ధమైనట్లు వెల్లడించింది. ప్రేక్షకులు తనను ఇప్పటివరకు చూసిన ఇమేజ్‌కు భిన్నంగా ఈ సినిమాలో చూడబోతున్నారని ఆమె అభిప్రాయపడింది. సినిమా ప్రచారంలో భాగంగా ఇటీవల నాని కూడా కయాదు పాత్రపై స్పందించారు. ఒక పోస్టర్‌లో కయాదు సిగరెట్ తాగుతున్న లుక్ కనిపించడంతో ఆమె పాత్ర విలన్ తరహాలో ఉంటుందా అనే చర్చ సోషల్ మీడియాలో జరిగింది. అయితే ఒక పాత్ర స్మోక్ చేస్తేనే దాన్ని విలన్‌గా భావించాల్సిన అవసరం లేదని నాని స్పష్టం చేశారు. సినిమా కథ, ఆ ప్రపంచం అవసరాలకు అనుగుణంగా నేకొన్ని పాత్రల ప్రవర్తన ఉంటుందని చెప్పారు. కయాదు లోహర్‌కు తెలుగులో ఇది మరో కీలక అవకాశం. గతంలో 'అల్లూరి' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఆమెకు 'డ్రాగన్' చిత్రంతో మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత తెలుగు ప్రేక్షకుల్లోనూ ఆమెకు ఫాలోయింగ్ పెరిగింది. ప్రస్తుతం 'ది ప్యారడైజ్'లో నాని సరసన నటించడం ద్వారా మరింత విస్తృతమైన ప్రేక్షకులను చేరుకునే అవకాశం లభించింది. కయాదు కూడా బలమైన, సవాల్ విసిరే పాత్రలపై ఆసక్తి ఉందని గతంలో వెల్లడించింది. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్'లో నాని జడల్ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో కయాదు పోషిస్తున్న సుబ్బలక్ష్మి పాత్ర కథలో ఎలాంటి మలుపులు తీసుకొస్తుంది? నాని పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? ఆమె పాత్రలోని గ్రే షేడ్స్ కథను ఏ స్థాయిలో ప్రభావితం చేస్తాయి? అన్నది తెరపై చూడాల్సిందే. ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్‌తో సినిమాపై ఆసక్తి పెరగగా.. కయాదు పాత్రపై వచ్చిన తాజా వివరాలు మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి.

# బిగ్‌బాస్ నుంచి బయటకొచ్చిన కృష్ణుడు



**మహా:** బిగ్‌బాస్ తెలుగు 10వ సీజన్‌లో రెండో వారం ఎలిమినేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈసారి నటుడు కృష్ణుడు హౌస్ నుంచి బయటకు వచ్చారు. ఎలిమినేషన్ అనంతరం జియోహాట్‌స్టార్‌లో జరిగిన లైవ్ ఇంటరాక్షన్‌లో పాల్గొన్న ఆయన.. తన బిగ్‌బాస్ ప్రయాణం, హౌస్‌లో ఎదురైన పరిస్థితులు, తోటి కంటెస్టెంట్ల ఆటతీరుపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను ఎలిమినేట్ కావడంపై ఎలాంటి అసంతృప్తి లేదని, ప్రేక్షకులు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని కృష్ణుడు పేర్కొన్నారు. హౌస్‌లో ఉన్న సమయంలో తాను అనుకున్న స్థాయిలో గేమ్ ఆడలేకపోయానని కృష్ణుడు అంగీకరించారు. అందుకే ఎలిమినేషన్ తనకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదని తెలిపారు. బిగ్‌బాస్ ఇంట్లో గడిపిన సమయం తనకు ప్రత్యేకమైన అనుభవంగా మిగిలిపోయిందని చెప్పారు. విభిన్నమైన వ్యక్తిత్వాలు కలిగిన వారితో కలిసి జీవించడం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నానని పేర్కొన్నారు. హౌస్‌లో తాను ఎక్కువగా తింటూ, నిద్రపోతూ కనిపించడంపై వచ్చిన విమర్శలపైనా కృష్ణుడు స్పందించారు. ఇంట్లో ఆహార పరిస్థితులు బయట ఉన్నట్లుగా ఉండవని, సరైన అల్పాహారం అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కంటెస్టెంట్లు సాధారణ భోజనంతోనే రోజులు గడపాల్సి వచ్చేదని వివరించారు. తాను గేమ్‌లో చురుగ్గా కనిపించకపోవడానికి తన శారీరక పరిస్థితులు కూడా కొంత ప్రభావం చూపాయని వెల్లడించారు. ఇక రోహిత్‌తో తనకు ఏర్పడిన అనుబంధం గురించి కృష్ణుడు ప్రత్యేకంగా మాట్లాడారు. మొదట్లో ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినప్పటికీ.. ఆ తర్వాత క్రమంగా మంచి స్నేహం ఏర్పడిందని చెప్పారు. తాను హౌస్ నుంచి బయటకు వస్తున్న సమయంలో రోహిత్ భావోద్వేగానికి గురికావడం తనను కదిలించిందని తెలిపారు. హౌస్ బయట కూడా తమ స్నేహం కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రోహిత్‌లో మంచి గేమ్ ఆడే సామర్థ్యం ఉందని, అయితే ఆటపై ఏకాగ్రత కోల్పోకుండా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సూచించారు. బిగ్‌బాస్ హౌస్‌లో తనకు నచ్చిన, నచ్చని ఆటతీరుల గురించి కూడా కృష్ణుడు తన అభిప్రాయాలను వెల్లడించారు. త్రిగుణ్, రోహిత్ ఆటను ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన.. వీరిద్దరూ గేమ్ స్వభావాన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. తన అంచనా ప్రకారం త్రిగుణ్, రోహిత్, అమన్, ముఖేష్, ఝాన్సీ వంటి కంటెస్టెంట్లు ముందుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అదే సమయంలో కొంతమంది కంటెస్టెంట్ల ఆటతీరుపై కృష్ణుడు విమర్శలు కూడా చేశారు. సుధీర్, ముఖేష్, వర్షిణి, చరణ్ వంటి కంటెస్టెంట్ల ప్రవర్తనపై తనకు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయని చెప్పారు. అయితే ఇవన్నీ హౌస్‌లో తాను గమనించిన విషయాల ఆధారంగా చెప్పిన వ్యక్తిగత అభిప్రాయాలేనని ఆయన వ్యాఖ్యల సందర్భం స్పష్టం చేస్తోంది. తన ఆరోగ్యం, ఆహారపు అలవాట్ల గురించి కూడా కృష్ణుడు ప్రస్తావించారు. హౌస్‌లోకి వచ్చిన తర్వాత స్వీట్లు, చక్కెరను ఒక్కసారిగా పూర్తిగా తగ్గించడం వల్ల శారీరకంగా నీరసంగా అనిపించిందని ఆయన తెలిపారు. దాని ప్రభావం తన గేమ్‌పై పడిందని చెప్పారు. బయటకు వచ్చిన తర్వాత ఆహారపు అలవాట్ల విషయంలో క్రమంగా మార్పులు చేసుకోవాలని సూచనలు అందుకున్నట్లు వెల్లడించారు.

# రణబాలి నుంచి ఏందయ్యా సామీ

**మహా:** విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'రణబాలి'. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం మరో ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చింది. సినిమాలోని 'ఏందయ్యా సామీ' పూర్తి పాటను విడుదల చేసింది. పాటలో విజయ్, రష్మిక జంటగా కనిపించే సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. పాట విడుదలతో సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌కు మరింత ఊపు వచ్చినట్లైంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో 'ఏందయ్యా సామీ' పాటపై కూడా ఆసక్తి నెలకొంది. అజయ్-అతుల్ సంగీతం అందించిన ఈ పాటకు శ్వేతా మోహన్, అజయ్ గోగవాలే గాత్రం అందించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. పాటలోని సంగీతం, గానం, విజువల్స్ సినిమాకు సంబంధించిన కాలం, కథా నేపథ్యాన్ని ప్రతిబింబించేలా రూపొందించినట్లు కనిపిస్తోంది. 'రణబాలి' కథ 19వ శతాబ్దపు బ్రిటిష్ పాలన కాలం నేపథ్యంలో సాగుతుంది. 1854 నుంచి 1878 మధ్య చోటుచేసుకున్న వాస్తవ సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. విజయ్ దేవరకొండ ఇందులో ఓ యోధుడి పాత్రలో కనిపించనున్నాడు. అధికారం, పోరాటం, ప్రతిఘటన వంటి అంశాలతో కథనం సాగనున్నట్లు ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్ ద్వారా అర్థమవుతోంది. రష్మిక మందన్న ఇందులో జయమ్మ పాత్రలో నటిస్తోంది. ఇటీవల ఆమె తన చిత్రీకరణ భాగాన్ని పూర్తి చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. విజయ్, రష్మిక కలిసి నటిస్తున్న ఈ సినిమా.. వారి పెళ్లి తర్వాత వస్తున్న తొలి చిత్రం కావడంతో అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో కలిసి నటించిన ఈ జంట మరోసారి తెరపై కనిపించనుండటం కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. టీసిరీస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. అజయ్-అతుల్ సంగీతం అందిస్తుండగా, నీరవ్ షా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కార్తిక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్రలో కనిపించనున్నారు. 'ఏందయ్యా సామీ' పాట విడుదలతో 'రణబాలి' ప్రమోషన్స్ మరింత వేగం పుంజుకున్నాయి. విజయ్ దేవరకొండ, రష్మిక జంటకు ఉన్న క్రేజ్‌కు తోడు భారీ పీరియాడిక్ నేపథ్యం, యాక్షన్ అంశాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. దసరా సందర్భంగా అక్టోబర్ 16న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com